

అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లోని శ్రీదేవి అమ్మవారిని శాకంబరిగా అలంకరించిన దృశ్యం - అమలాపురం

రేపు పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష

జిల్లాలో రెండు కేంద్రాలు ఏర్పాటు : జేసీ



అమలాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని రెండు కేంద్రాల్లో 386 మంది అభ్యర్థులకోసం ఆదివారం కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పరీక్ష నిర్వహణకు సంబంధించి వివిధ శాఖల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల జరిగే పరీక్షకు 206 మంది, భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలల్లో జరిగే పరీక్షకు 180 మంది హాజరు కానున్నారని, వీరికి 20వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఉపతహశీల్దార్ గోపాలకృష్ణ, బీవీసీ కళాశాలలో ఉపతహశీల్దార్ సుబ్రహ్మణ్యేశ్వరరావు లైజన్ అధికారులుగా వ్యవహరించాలన్నారు. పరీక్షా సమయంలో ఆయా కేంద్రాల వద్ద 140 సెక్షన్ విధించడంతోపాటు సమీపంలో ఎటువంటి జిరాక్సు షాపులు తెరవకుండా మూయించి వేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో రాజకుమారి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీపీవో డి.శాంత లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అంతర్వేది

మినీ ఫిషింగ్ హార్బరు, టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు

అడ్వెంచర్ బోటింగ్ కోసం జిల్లా కలెక్టర్ స్థల పరిశీలన

అంతర్వేది, జూలై18(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీ, సాగర సంగమం అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరు అభివృద్ధి, టూరిజం అభివృద్ధికి అడ్వెంచర్ బోటింగ్ యాక్టివిటీ కోసం స్థల సేకరణకు కృషి చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం ఆయన అంతర్వేది సముద్ర ముఖద్వారం, వశిష్ఠ రేవులో బోటులో ప్రయాణించి మినీ ఫిషింగ్ హార్బర్ కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ మినీ ఫిషింగ్ హార్బర్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం 14 మంది సభ్యులతో కూడిన నిర్వహణ కమిటీని ప్రభుత్వం ఏర్పాటుచేసిందన్నారు. ఇటీవల కమిటీ సభ్యులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పూర్తిస్థాయి హార్బరు నిర్వహణనకు మౌలిక వసతులు కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని సూచించడం జరిగిందన్నారు. ఈనేపథ్యంలోనే మినీ ఫిషింగ్ హార్బరును క్షేత్రస్థాయిలో పరిశీలన, అధ్యయనం చేయడానికి స్థానికంగా అధికారుల బృందంతో పరిశీలించినట్టు చెప్పారు. మినీ ఫిషింగ్ హార్బరు ద్వారా ఆక్షన్ హాలు అద్దెలు, ల్యాండింగ్ చార్జీలు, ఇతర ఆదాయాలను పరిగణలోకి తీసుకుని నివేదిక రూపొందించడం జరిగిందని, ఆదాయ వనరులను పరిగణనలోకి తీసుకుని హార్బరుకు పూర్తిస్థాయిలో వసతులను



వశిష్ఠ రేవులో బోటుపై పర్యాటక ప్రాంతంలో పర్యటిస్తున్న కలెక్టర్, ఆర్డీవో

నిర్వహణ కమిటీల సభ్యుల సారథ్యంలో కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం స్థానికంగా మడ అడవుల పరిరక్షణ చర్యలను బోటులో పర్యటించి పరిశీలించారు. అంతర్వేది బోటింగ్ సర్వీసెస్ అథారిటీ వారు బోటింగ్ యాక్టివిటీ కోసం టెండర్లు వేశారని, ఆ మేరకు స్థానికంగా సాధ్యాసాధ్యాలను బేరీజు వేస్తూ తదుపరి స్థల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. దిండి పర్యాటక రిసార్టు నుంచి బోటులో అంతర్వేది రక్తతుల్య కాల్వ వద్దకు పర్యాటకులు భక్తులు చేరుకుని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేలా బోటింగ్ యాక్టివిటీపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.మాధవి, పర్యాటకరంగ అభివృద్ధిశాఖ ప్రాంతీయ సంచాలకుడు పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





ఓడలరేవు తీరంలో టీ ఆకారంలో నిర్మించిన జెట్టీ శిథిల స్థితికి చేరుతున్న దృశ్యం... పిల్లర్లకే పరిమితమైన ఓడలరేవులో ఆక్షన్ హాలు

అసంపూర్తిగా మినీ ఫిషింగ్ హార్బర్లు

- అంతర్వేదిలో రూ.7 కోట్ల విలువైన పనులు పెండింగ్
- వాటిని సత్వరం పూర్తిచేయాలని ఎమ్మెల్యే వరప్రసాద్ వినతి
- కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన అంతర్వేది ఫిషింగ్ హార్బరు కమిటీ సభ్యులు
- ఓడలరేవులో ఇసుక మేటలతో పూడుకుపోతున్న జెట్టీ.. ఆక్షన్ హాలూ అంతే

మత్స్యకారుల మెరుగైన జీవనోపాధి లక్ష్యంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రెండు ప్రాంతాల్లో నిర్మించ తలపెట్టిన ఫిషింగ్ హార్బర్లు పూర్తికాకుండానే శిథిలస్థితికి చేరుతున్నాయి. అసంపూర్తి నిర్మాణాలు, రహదారులకు ఇరువైపులా పెరిగిపోయిన చెత్తాచెదారం, భవనాల్లో పెరిగిపోయిన పిచ్చిమొక్కలతో అధ్వాన స్థితికి చేరుకుంటున్నాయి. ఆ భవనాల నిర్మాణం, ఫిషింగ్ హార్బరుకు సంబంధించిన జెట్టీల నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థల నిర్లక్ష్యం ఫలితంగా నిరుపయోగంగా మారుతున్నాయని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

ఒడ్డుకు చేరిన బోట్లు



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సముద్రం, గోదావరి మొగలు కలిసే ప్రాంతమైన అంతర్వేది, అల్లవరం మండలం ఓడలరేవులో నిర్మించ తలపెట్టిన ఫిషింగ్ హార్బరుల నిర్మాణాల ప్రగతిపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని మత్స్యకారులు కోరుతున్నారు. అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరు అభివృద్ధి కోసం రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ ఇప్పటికే కొన్ని సమస్యలను కలెక్టర్‌తో జరిగిన సమీక్షలో ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్న పరిణామాలు ఆ ప్రాంత మత్స్యకారులను ఒకింత ఆనందానికి గురిచేస్తున్నాయి. సుమారు రూ.30 కోట్ల అంచనా వ్యయంతో అంతర్వేదిలో ఫిషింగ్ హార్బరు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.23 కోట్ల విలువైన పనులను కాంట్రాక్టు సంస్థ పూర్తిచేసి 2023లో ప్రభుత్వానికి అప్పగించినట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. మిగిలిన రూ.7 కోట్లకు సంబంధించిన పనులు సత్వరం చేపట్టి మత్స్యకారులు వేటకు వెళ్లేవిధంగా వాటిని అభివృద్ధి చేయాలని కోరారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా, తాగునీరు, అప్రోచ్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన వంటివి రూ.7 కోట్లతో చేపట్టి పూర్తిచేయాలని కోరారు. గతంలో జలవనరులశాఖ ద్వారా టెండర్లు పిలిచి చేపట్టిన ఈ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం హార్బరుకు 70కుపైగా పడవల ద్వారా మత్స్య ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నారు. పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తే రోజుకు 200కు పైగా పడవలు రాకపోకలు సాగించే అవకాశం ఉంది. ఈ మినీ హార్బరు నుంచి సింగపూర్, బెంగుళూరు, గోవా, ముంబై, కేరళ వంటి రాష్ట్రాలకు చేపల ఉత్పత్తుల ఎగుమతి అవుతాయని అంచనా. 1.75 కిలోమీటర్ల ఇక్కడి రహదారి మొక్కలతో అధ్వాన స్థితికి చేరింది. విద్యుత్ సౌకర్యంతోపాటు రాయితీలతో అందించే పెట్రోలు బంకులు కూడా ఇక్కడ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను అంతర్వేది మినీ హార్బరు కమిటీ సభ్యులు కోరారు. జిల్లా కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించి సత్వర చర్యలకు ఆదేశాలిచ్చారు.

ఓడలరేవులో అధ్వాన స్థితికి చేరిన హార్బరు

అల్లవరం మండలం ఓడలరేవులో మత్స్యకారుల కోసం కొన్ని సంవత్సరాల కిందట నిర్మించ తలపెట్టిన మినీ హార్బరు అసంపూర్తిగా నిలిచిపోయింది. జెట్టీ ఏర్పాటుచేసిన ప్రాంతంలో పూర్తిగా ఇసుక మేటలు వేయడం వల్ల అక్కడకు బోట్లు వచ్చే పరిస్థితి కూడా లేదనేది మత్స్యకారుల ఆవేదన. ప్రస్తుతం జెట్టీ కింది మార్గంలో నీటి ప్రవాహం కొనసాగే పరిస్థితులు ఉండాల్సినప్పటికీ ఇసుక మేటలు భారీగా పేరుకుపోవడంతో నిరుపయోగంగా మారుతోంది. రూ.7.78 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ జెట్టీ నిర్మాణం పనులపై అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు. టీ ఆకారంలో జెట్టీ నిర్మించడంతోపాటు ఆక్షన్ హాలు పిల్లర్లకే పరిమితమై పిచ్చి మొక్కలతో నిండిపోయింది. తక్షణమే మత్స్యశాఖ అధికారులు ఈ జెట్టీ నిర్మాణంపై దృష్టి పెట్టి పూర్తిచేయడంతోపాటు జెట్టీకి వచ్చే ప్రాంతంలో వేసిన ఇసుక మేటలు తొలగించి వందల బోట్లలో వేటాడే మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



రేషన్ లైజేషన్!

రైస్ కార్డులకు.. రైట్ రైట్

- రేషన్‌కార్డులకు దరఖాస్తుల వెల్లువ
- ఉమ్మడిగా 1,53,341 వినతులు
- వైసీపీలో కార్డుల్లో కోత
- కూటమి ప్రభుత్వంలో అవకాశం
- భారీగా వెల్లువెత్తిన విజ్ఞప్తులు
- చేర్పులకు 1,10,587 దరఖాస్తులు
- అధికారుల గ్రీన్‌సిగ్నల్
- ఏటీఏం కార్డులా రైస్ కార్డులు

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు భారీగా వెల్లువెత్తాయి. గత వైసీపీ హయాంలో కొత్త కార్డుల జారీ లేకపోవడంతో వేలాది మంది పేదలు ఈసురోమన్నారు. రకరకాల కారణాలతో ఉన్న కార్డులను సైతం భారీగా అప్పట్లో ఏరేశారు. దీంతో ప్రభుత్వం మారాక కార్డుల జారీకి నిర్ణయించడంతో ఇప్పటి వరకు 1.53 లక్షల మంది అర్జీలు అందించారు. ఇందులో ఏకంగా 1.10 లక్షల మంది తమకు ఉన్న కార్డుల్లో అదనపు సభ్యులను చేర్చాలంటూ దరఖాస్తులు ఇచ్చారు. ప్రస్తుతం అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి దాదాపుగా పచ్చజెండా ఊపారు. త్వరలోనే లబ్ధిదారులకు ప్రభుత్వం కొత్తకార్డులను మంజూరు చేయనుంది.

నాడు ఉన్నవీ పీకేశారు..

గత వైసీపీ పాలనలో సంక్షేమ పథకాల అమలు పేరుతో ఎడాపెడా లబ్ధిదారులను కోసేశారు. రకరకాల నిబంధనల పేరుతో రేషన్‌కార్డులను భారీగా ఏరేశారు. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 16.50 లక్షల రేషన్‌కార్డులుండగా అందులో తెల్లకార్డులు 15.69 లక్షలు ఉండేవి. వీటిలో అనర్హులు అధికంగా ఉన్నారని భావించిన అప్పటి ప్రభుత్వం అమరావతి నుంచి 28,500 మంది కార్డుదారుల పేరుతో జాబితాను జిల్లా పౌరసరఫరాల శాఖకు పంపి గుట్టుగా క్షేత్రస్థాయి తనిఖీలు చేసి అందరి కార్డులు రద్దు చేయాలని ఆదేశించింది. 17,500 మంది కార్డుదారులు సొంత గ్రామాల్లో నివసించడం లేదనే కారణంతో వాటిని రద్దుచేసేశారు. దీంతో ప్రతిపక్ష హోదాలో నాడు టీడీపీ ఆందోళన బాట పట్టింది. కార్డులను అడ్డగోలుగా ఏరివేయడంపై నిరసనలు చేపట్టింది.అయితే ప్రభుత్వం మారిన తర్వాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టాలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టడానికి పచ్చజెండా ఊపారు. దీంతో గత మే 14 నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సచివాలయాల పరిధిలో రేషన్‌కార్డులకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొత్తగా వివాహమైనవారు, ఇప్పటివరకు రేషన్ కార్డు లేనివారు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ తప్పుగా నమోదైనవారు ఇలా ఏడు రకాల సేవలకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది.

1,53,341 అర్జీలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం ఇప్పటివరకు 1,53,341 మంది నుంచి అర్జీలు వచ్చాయి. కొత్తకార్డులు కావాలంటూ 14,197 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఉన్న కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చాలంటూ 1,10,587 మంది విజ్ఞప్తులు చేశారు. వచ్చిన అర్జీల్లో అత్యధికంగా కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చాలంటూ కోరినవే ఉన్నాయి. ఇప్పటివరకు వచ్చిన మొత్తం అర్జీల్లో 90 శాతానికిపైగా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. దాదాపు అన్ని అర్జీలను అధికారులు పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి జాబితా కూడా పంపారు. త్వరలో కొత్త కార్డుల జారీ చేయడానికి వీలుగా ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. దీంతో త్వరలోనే కార్డులు అందుతాయి.

ఏ జిల్లాకు ఎన్ని..

- కాకినాడ జిల్లా నుంచి 62,988 మంది ఉన్నారు. ఉన్న కార్డుల్లో అదనంగా కుటుంబ సభ్యులను చేర్చాలని 46,729 మంది, రేషన్‌కార్డు విభజించాలని 6,091, కొత్త కార్డులకు 5,170, చిరునామా మార్పునకు 1,986 మంది అర్జీలు అందించారు.
- కోనసీమలో మొత్తం 45,080 దరఖాస్తులు రాగా చిరునామా మార్పునకు 1,751, కొత్త సభ్యులను చేర్చాలంటూ 32,254 పేర్లు రద్దుకు 1,275 కొత్తకార్డులకు 4,268, కార్డు విభజించాలని 4,536 అర్జీలు వచ్చాయి.
- తూర్పుగోదావరి జిల్లా నుంచి 45,273 అర్జీలు వచ్చాయి. తమ కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలంటూ 31,604 మంది మొర పెట్టుకున్నారు. కార్డులు విభజించాలంటూ 4,664 మంది, కొత్త కార్డులు కావాలని 4,759 మంది అర్జీలు అందించారు.

ఇక డిజిటల్ కార్డులు

చంద్రబాబు అంటేనే ఐటీ ముఖ్యమంత్రి అంటారు.. ప్రస్తుతం రేషన్ కార్డుల్లోనూ ఆ మార్పు చూపిస్తున్నారు. త్వరలో ఇవ్వనున్న కొత్త రేషన్‌కార్డులను రైస్ కార్డుల పేరిట ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఇవి పూర్తిగా ఏటీఏం కార్డు తరహాలో కొత్తగా డిజైన్ చేశారు. వీటికి క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. రేషన్ దుకాణంలో సరుకులు తీసుకున్న తర్వాత డీలర్ సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వానికి కార్డుదారులు తమ అభిప్రాయాలు కూడా తెలపవచ్చు.



ఆనంద హరితం!



- నెరవేరిన మరో హామీ
- గ్రీన్‌ట్యాక్స్ తగ్గింపు
- వైసీపీలో రూ.20 వేలు
- ప్రస్తుతం రెండు స్లాబ్‌లు
- రూ.1500, రూ.3 వేలు
- సర్కారు ఉత్తర్వులు జారీ

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం మరో హామీ నెరవేర్చింది.. గ్రీన్ ట్యాక్స్ తగ్గించి వాహనదారులకు పెద్ద ఊరటనిచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కసారిగా పెంచిన హరిత పన్ను వాహనదారుల తలకు మించిన భారమైంది. రోడ్డెక్కిన ప్రతి వాహనం నుంచి డబ్బులు గుంజేసింది. వందల్లో ఉండే గ్రీన్‌ట్యాక్స్‌ను వేలల్లో పెంచింది.. పర్యావరణం పేరుతో పది టన్నుల లారీలపై రూ.ఐదు వేలు, 30 టన్నుల లారీలపై రూ.15 వేలు విధించడంతో లారీ యజమానులు గగ్గోలు పెట్టారు. ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే ఈ ట్యాక్స్ తగ్గిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక హరిత పన్ను విషయమై లారీ యజమానుల వినతిని సర్కారు పరిశీలించింది. (గ్రీన్ ట్యాక్స్) హరితపన్ను భారాన్నితగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

వైసీపీలో పిండుడే..

గత ప్రభుత్వంలో వివిధ వాహనాలకు ఏటా గరిష్ఠంగా రూ.20 వేల వరకు గ్రీన్ ట్యాక్స్ విధించగా కూటమి ప్రభుత్వం దీనిని సవరించి ఏడాదికి రూ.1500, రూ.3000 చొప్పున రెండు శ్లాబుల్లో వసూలు చేసేలా కొత్త విధానం తెచ్చింది. సరకు రవాణా (లారీలు, వ్యాన్లు), ప్రజా రవాణా (బస్సులు, మినీ బస్సులు) ఏడేళ్ల తర్వాత ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలంటే ఏటా హరిత పన్ను చెల్లించాలి. గతంలో ఈ పన్ను కేవలం రూ.200 మాత్రమే ఉండేది. కాలం చెల్లిన వాహనాలను తగ్గించాలని దీనిని పెంచుకునేలా కేంద్రం వెసులుబాటు కల్పించింది. దీనిని ఆసరాగా తీసుకున్న జగన్ ప్రభుత్వం 2022 జనవరి నుంచి రాష్ట్రంలో హరిత పన్నును భారీగా పెంచింది. ఏడు నుంచి పదేళ్ల వాహనాలకు సగం త్రైమాసిక పన్ను విలువ, పదేళ్ల నుంచి 12 ఏళ్ల నాటికి ఒక త్రైమాసిక పన్ను విలువ, 12 ఏళ్లు దాటితే రెండు త్రైమాసిక పన్నుల విలువ మేర చెల్లించేలా ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆయా వాహనాల కేటగిరీ, వాటి వయసు బట్టి కనిష్ఠంగా రూ.800 మొదలుకొని గరిష్ఠంగా రూ.20 వేల వరకు ఏటా చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. లారీలు, టిప్పర్ల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేసింది. పాసింజర్ వాహనాలు, స్కూలు, కాలేజీ బస్సులు, మ్యాక్సీ క్యాబ్స్, ఓమ్నీ బస్సులు వంటి వాటికి రూ.ఆరు వేలు, చివరికి ఆటోలు, బైక్‌లు, క్రేన్‌లు, ట్రాక్టర్లపైనా భారీగా పన్ను పెంచారు. పన్ను భారం భరించలేక వీరంతా ఆందోళనలు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఉమ్మడి జిల్లాలో 55 వేల వరకు లారీలు ఉండగా, వీటిపై కోట్లలో పన్ను భారం పడింది. కాకినాడ జిల్లాలో 2.94 లక్షలు, తూర్పుగోదావరి జిల్లాలో 2.10 లక్షలు, కోనసీమ జిల్లాలో 1.80 లక్షల వాహనదారుల నుంచి జగన్ ప్రభుత్వం హరిత పన్ను పిండేసింది.

జిల్లాల్లో తగ్గనున్న భారం

ప్రస్తుతం హరిత పన్నుపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రూ.24.10 కోట్ల వరకు ఉమ్మడి జిల్లా వాహనాలపై పన్నుభారం తగ్గనుంది. అత్యధికంగా కాకినాడ జిల్లాలో 2.94 లక్షల వాహనాలపై రూ.9 కోట్లు, తూర్పుగోదావరిజిల్లాలో 2.10 లక్షల వాహనాలపై రూ.8.10 కోట్లు, కోనసీమలో 1.80 లక్షల వాహనాలపై రూ.ఏడు కోట్ల పన్ను భారం తగ్గనుంది.



పి.గన్నవరం ఇరిగేషన్ కార్యాలయం వద్ద సెంట్రల్ డెల్టా నీటి సంఘం సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ

ఈస్ట్రన్, సెంట్రల్ డెల్టా పరిధిలో 4,800 ఆక్రమణలు గుర్తించాం

- నీటి సంఘాల సభ్యులకు త్వరలో శిక్షణ తరగతులు
- సెంట్రల్ డెల్టాలోని కాల్వలకు 2700 క్యూసెక్కుల నీరు
- ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్

పి.గన్నవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్, ఈస్ట్రన్ డెల్టాలో పరిధిలో కాల్వలు వెంబడి, ఇరిగేషన్ స్థలాల్లో ఐదేళ్ల కిందట 4,800 ఆక్రమణలు గుర్తించామని ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్ తెలిపారు. ఈ సంఖ్య ఈ ఐదేళ్లలో మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ప్రతి నెల రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు బృందంగా ఏర్పడి నోటీసులు అందిస్తున్నారని, మూడు నెలల అనంతరం జిల్లాస్థాయిలో రివ్యూలు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. పి.గన్నవరం సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద శుక్రవారం సెంట్రల్ డెల్టా పరిధిలో 56 నీటిసంఘాల సభ్యులతో ఏర్పాటుచేసిన సమావేశానికి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, ఎస్ఈ పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన నీటి సంఘాల సభ్యులకు త్వరలో శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే ఈస్ట్రన్, సెంట్రల్ డెల్టా పరిధిలో 814 మంది లస్కర్లు ఉన్నారని, వారికి ఇప్పటికే 8 నెలల జీతాన్ని చెల్లించామని, మరో 15 రోజుల్లో మిగిలిన జీతాలను చెల్లించే ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం సెంట్రల్ డెల్టా పరిధిలో బ్యాంక్ కెనాల్‌కు 1050 క్యూసెక్కులు, అమలాపురం ప్రధాన పంట కాల్వకు 950 క్యూసెక్కులు, పి.గన్నవరం ప్రధాన పంటకాల్వకు 600 క్యూసెక్కుల నీటిని వెరసి 2700 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నామని చెప్పారు. ప్రధాన పంటకాల్వ 13 కిలోమీటర్లు మేర పూడికతీత పనులపై సర్వే చేయిస్తున్నామని, అనంతరం ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని చెప్పారు. వర్షాలు పుష్కలంగా పడే వరకు సంబంధిత లాకుల వద్ద ఆయా నీటి సంఘాల సభ్యుల సమన్వయంతో వంతులు వారీ విధానాన్ని అవలంబించాలన్నారు. సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ మాట్లాడుతూ నీటి సంఘాల పరిధిలో ఉన్న ఆయకట్టులో సమస్యలు ఉంటే అధికారులతో మాట్లాడుకుని సమన్వయంగా రైతులకు సాగునీరు అందించాలని సూచించారు. లొల్లలాకులను రూ.77 కోట్లతో స్థిరీకరిస్తే మూడు ప్రధాన పంటకాల్వలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. కాల్వల వెంబడి ఉన్న సమస్యలను గుర్తించి అధికారులు ఆధ్వర్యంలో దశల వారీగా పనులు పూర్తిచేసుకోవాలని సూచించారు. అనంతరం పలు తీర్మానాలపై నీటి సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో ఆమోదం తెలిపారు. అనంతరం కాంట్రాక్టు లస్కర్లు ఎస్ఈ గోపీనాథ్, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావులను దుశ్శాలువాతో సన్మానించారు.

అధికారులపై డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యులు ఫైర్

నీటిసంఘాల సభ్యులు ఎన్నికై ఆరు నెలలు గడుస్తోందని, ఇప్పటివరకు ఎన్ని సమావేశాలు ఏర్పాటుచేశారని సమావేశంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యులు అధికారులను నిలదీశారు. ఎన్నిసార్లు సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్ని తీర్మానాలు, సమస్యలను కలెక్టర్‌కు వివరించారో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారుల సమన్వయం లోపంతోనే సాగునీరందడం లేదని వీరంతా అసహనం వ్యక్తం చేశారు. సెంట్రల్ డెల్టా పరిధిలో ఇన్‌చార్జి అధికారులే పాలన చేస్తుంటే రైతుల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని మండిపడ్డారు. సమావేశంలో ఇరిగేషన్ ఈఈ కాశీ వెంకటేశ్వరావు, గన్నవరం ఇన్‌చార్జి డీఈ నాగార్జున, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు వైస్ చైర్మన్ కరుటూరి నరసింహరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు కాకర శ్రీనివాస్, దాట్ల గోపాల్‌రాజు, చావల జగన్నాథం, దంగేటి వెంకటనాయుడు, చెలువూరి సుబ్బరాజు, ఆకాశం శ్రీనివాస్, ఇరిగేషన్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

శాకంబరీ నమోస్తుతే

ఆషాఢ శుక్రవారం సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలుచోట్ల అమ్మవార్లు శాకంబరిగా దర్శనమిచ్చారు. వందల కిలోల కూరగాయలు, ఆకు కూరలతో దేవతామూర్తులను అలంకరించగా భక్తులు దర్శించుకుని పులకించారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని శాకంబరిగా పూజిస్తే కలిగే ప్రయోజనాలను పండితులు వివరించారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామ దేవత కనక మహాలక్ష్మి అమ్మవారు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి గ్రామ దేవత వనువులమ్మ



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ముంగండ గ్రామ దేవత ముత్యాలమ్మ



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ ఇందుపల్లి గ్రామ దేవత మావుళ్లమ్మ అమ్మవారు

ఆయిల్‌పామ్‌పై రైతుల మొగ్గు

ఆయిల్‌పామ్ సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ఈ పంటను సాగు చేయాలని ప్రభుత్వం విస్తృత ప్రచారం సాగించడంతో పాటు పలు రాయితీలు అందిస్తోంది. దీంతో నీటి లభ్యత తక్కువ, ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో వరికి బదులుగా ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు.

- వరి సాగుకు ప్రత్యామ్నాయం
- ఉద్యానవన శాఖ ద్వారా రాయితీలు
- విస్తృత ప్రచారం చేస్తున్న ప్రభుత్వం



గొల్లప్రోలు మండలంలో సాగవుతున్న ఆయిల్‌పామ్

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

మెట్ట, మైదాన ప్రాంతాల్లోనూ ఆయిల్‌పామ్ విస్తీర్ణం గణనీయంగా పెంచాలని భావిస్తున్న ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ చేపట్టింది. ఉద్యానవన శాఖ ద్వారా ప్రచారం సాగిస్తోంది. ఉద్యానవన శాఖ ద్వారా సాగుకు, ఇందుకు అవసరమైన యంత్ర పరికరాలపై అందించే సబ్సిడీలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు దిగుబడులు వచ్చిన తర్వాత కచ్చితమైన మార్కెట్ సౌకర్యం ఉంటుందనే భరోసా కల్పిస్తోంది. వరి అధికంగా పండించే కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లాల్లో వరి సాగు తగ్గించి ఆయిల్‌పామ్ వైపు దృష్టిసారించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో మండలాల వారీగా టార్గెట్లు విధించినప్పటికీ ఇప్పుడు సాధ్యమైనంత వరకు ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ చేసేలా చూడాలని ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు.

గతంలో నీటి లభ్యత లేని ప్రాంతాల్లోనే ఎక్కువగా ఆయిల్‌పామ్‌ను సాగు చేసేవారు. కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లోని మెట్ట మండలాల్లోనే దీని విస్తీర్ణం అధికం. గోదావరి, ఏలేరు, పీబీసీ, పంపా, తాండవ, పుష్కర ఆయకట్టు ప్రాంతాల్లోనూ ఇప్పుడు సాగు ప్రారంభమైంది. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఇటీవల ఒక ఎన్ఆర్ఐ వైద్యుడు తనకు గల పది ఎకరాల్లో వరి సాగు మాని ఆయిల్‌పామ్ మొక్కలను నాటించారు. ఇదే రీతిలో పలు ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన రైతుల్లో మొదలైంది. అయితే దిగుబడి రావడానికి ఎక్కువ సమయం వేచిచూడటం, అప్పటివరకు పంటపై ఎటువంటి ఆదాయం ఉండకపోవడం ఒక మైనస్‌గా మారింది. అయితే ఆయిల్‌పామ్ మొక్కల మధ్యలో కాయగూరలు, అపరాలు, ఇతర పంటలను అంతర పంటలుగా సాగు చేసుకుని ఆదాయం పొందవచ్చని ఉద్యానవన శాఖాధికారులు చెప్తున్నారు. ఏడవ ఏడాది నుంచి హెక్టార్‌కు సగటున రూ.2.50 లక్షలు నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుందంటున్నారు. 25 సంవత్సరాలు పాటు దీర్ఘకాలంగా కొనసాగే పంట కావడంతో ఒకసారి మొక్కలు నాటితే ప్రతి ఏటా వరి మాదిరిగా పంట వేసే అవసరం ఉండదని వివరించారు..

నూతన సాగుపై రాయితీలు: వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు హెక్టారుకు (2.50 ఎకరాలు) ఎన్ఎంఈవో-ఓపీ పథకం కింద రూ.29వేలు సబ్సిడీ లభిస్తోంది. 9 ఇంటు 9 మీటర్ల దూరంలో హెక్టారుకు కనీసం 143 మొక్కలు నాటాల్సి ఉంటుంది. ఈ దిగుమతి నాటును పెద్దాపురం పతంజలి సంస్థ ద్వారా ఉచితంగా అందిస్తున్నామని ఉద్యానవన శాఖాధికారులు తెలిపారు. ఇదే సంస్థ రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తోంది. అంతర పంటలుగా కాయగూరలు, అపరాలు సాగుకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. పామాయిల్ దిగుబడి వచ్చేదాకా అంతర పంటల ద్వారా ఆదాయం వస్తుంది.

ఆయిల్‌పామ్ పంటకు డ్రిప్ ఇరిగేషన్ తప్పనిసరి. ఈ పరికరాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరు శాతం సబ్సిడీపై, ఐదు ఎకరాల లోపు రైతులకు 90శాతం, 5-10 ఎకరాల రైతులకు 70శాతం, పది ఎకరాలు పైబడిన రైతులకు 50శాతం సబ్సిడీపై సరఫరా చేస్తారు. ఈ సబ్సిడీని ప్రభుత్వమే భరిస్తుంది. అదే విధంగా సాగులో అవసరమైన చాప్ కట్టర్ యూనిట్‌కు రూ.50వేలు, ట్రాక్టర్‌తో ట్రాలీ యూనిట్‌కు రూ.2లక్షలు, అల్యూమినియం పోర్టబుల్ ల్యాడర్‌కు రూ.5వేలు, మోటారైజ్డ్ చిసెల్‌కు రూ.15 వేల వరకు ప్రస్తుతం రాయితీ ఇస్తున్నారు.

ఏలేరు, పీబీసీ ఆయకట్టులోనూ ...

ఏలేరు, పీబీసీ, పుష్కర ఆయకట్టులోనూ ఆయిల్‌పామ్ సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో కొత్తగా 58 హెక్టార్లలో ఆయిల్‌పామ్ పంట వేశారు. ఇప్పటికే పంట ఉన్న విస్తీర్ణం 1246 హెక్టార్లు కాగా... ఈ ఏడాది 350 హెక్టార్లల్లో అదనంగా సాగు చేస్తారని భావిస్తున్నారు.



ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు

స్థిర ఆదాయానికి ఆయిల్‌పామ్ సాగు చేయండి



వై.సోమరాజశేఖర్, ఉద్యానవన శాఖాధికారి, పిఠాపురం

స్థిరమైన అధిక ఆదాయం కోసం ఆయిల్‌పామ్ సాగు చేస్తే మేలు. నీటి లభ్యత తక్కువగా ఉండే ప్రాంతాల్లో వరికి బదులుగా దీనిని సాగు చేస్తే తక్కువ నీటితోనే పంట పండించవచ్చు. దిగుబడులు వచ్చే వరకు అంతర పంటలుగా కాయగూరలు, కందులు, అపరాలు సాగు చేసుకుని ఆదాయం పొందవచ్చు. ఆయిల్‌పామ్ సాగుకు, ఇందుకు అవసరమైన పరికరాలకు ప్రభుత్వం పలు రాయితీలు కల్పిస్తోంది. రైతులు వీటిని వినియోగించుకోవాలని కోరుతున్నాము. ఆయిల్‌పామ్ సాగుపై అందరికీ అవగాహన కల్పిస్తున్నాం.

ద్రాక్షారామలో నేడు సీతారాముల కల్యాణం

● కల్యాణ రథం ఊరేగింపు ● 21తో ముగియనున్న సప్తసప్తాహం



పురవీధుల్లో ఊరేగుతున్న సీతారాముల కల్యాణరథం

ద్రాక్షారామ,జూలై18(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరాలయ బాహ్యప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం ఉదయం భద్రాది సీతారాములు కల్యాణం జరుగుతుంది. ప్రసన్నాంజనేయస్వామి బాలభక్త సమాజం ఆధ్వర్యంలో గత నెల 2న ప్రారంభమైన సప్తసప్తాహం ఈనెల 21న ముగియనుంది. ఈ నేపథ్యంలో శనివారం నుంచి సోమవారం వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా శనివారం భద్రాది సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భద్రాది సీతారాముల కల్యాణ రథం శుక్రవారం సాయంత్రం ద్రాక్షారామ చేరుకుంది. భద్రాది నుంచి సీతారాముల కల్యాణం జరిపించేందుకు వైదిక బృందం, ఆలయ సిబ్బంది వచ్చారు. కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహిస్తారు.

కల్యాణరథం ఊరేగింపు

శుక్రవారం రాత్రి సీతారాముల కల్యాణరథాన్ని ద్రాక్షారామ పురవీధుల్లో ఊరేగించారు. మంగళ వాయిద్యాల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా సప్తసప్తాహం ముగింపు సందర్భంగా పూర్ణాహుతి, శాంతి కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేకం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులతో జరుగుతుంది. అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామని బాలభక్తసమాజం అధ్యక్షుడు బోనం శ్రీను తెలిపారు.

మరుగుదొడ్ల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 15 న్యాయస్థానాల్లో 223 మరుగుదొడ్లను కాంట్రాక్టు పద్ధతిలో నిర్వహించడానికి ఆసక్తి కలిగిన ఏజెన్సీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. 34 మంది సిబ్బందిని నియమించుకొని ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకూ రాజమహేంద్రవరంలోని 59, అమలాపురం 15, కాకినాడ 46, పెద్దాపురం 13, పిఠాపురం 30, రామచంద్రాపురం 6, రాజోలు 8, కొత్తపేట 6, ఆలమూరు 9, ప్రత్తిపాడు 10, ముమ్మిడివరం 5, తుని 6, అనపర్తి 5, రంపచోడవరం 3, అడ్డతీగలలోని 2 మరుగుదొడ్లను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అర్హత కలిగిన ఏజెన్సీలు జూలై 25 సాయంత్రం 5గంటలలోపు తమ కొటేషన్లను సీల్డ్ కవరులో రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టు కార్యాలయంలో సమర్పించాలని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఆయా మరుగుదొడ్ల ప్రదేశాలను పని దినాల్లో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్య స్వయంగా వచ్చి పరిశీలించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

అశోక్ గజపతిరాజును కలిసిన కోటిపల్లి దేవస్థానం సిబ్బంది



గజపతిరాజుకు స్వామి వారి ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

కె.గంగవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్‌గజపతి రాజు ప్రముఖ పుణ్యక్షేత్రం కోటిపల్లి శ్రీ ఛాయాసోమేశ్వరస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్తగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయనను దేవస్థానం ఈవో భీమశంకరం ఆధ్వర్యంలో సిబ్బంది, అర్చకస్వాములు కలిసి శుక్రవారం విజయనగరం వెళ్లి అభినందనలు తెలియజేశారు. స్వామి వారి ప్రసాదం అందజేశారు.

వరద తగ్గుముఖం

ధవళేశ్వరం, జూలై 18(ఆంధ్రజ్యోతి):తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. శుక్రవారం సాయంత్రం కాటన్ బ్యారేజ్ ద్వారా 46,406 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టాకు 5వేల క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7200క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద నీటి మట్టం 13.30 అడుగులుగా నమోదయింది.

ఆధునికతకు పెద్దపీట

- నూతన విద్యావిధానంతో ప్రపంచీకరణపై అవగాహన
- జేఎన్‌టీయూ మొట్ట మొదటి మహిళా వీసీ శాంతిశ్రీ పండిట్
- వర్సిటీలో ముగిసిన వర్క్‌షాప్



ఓక్ జూబ్లీ ఉత్సవాల లోగోను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద్, అతిథులు, వర్సిటీ అధికారులు

జేఎన్టీయూకే, జూలై 18(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకే ఏరోస్పేస్ సర్వీస్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఒకేషనల్, పబ్లిక్ డిజైన్ కోర్సులను అందించి ఆధునికతకు పెద్దపీట వేయాలని న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ(జేఎన్‌యూ) మొట్ట మొదటి మహిళా ఉపకులపతి ప్రొఫెసర్ ధూళిపూడి శాంతిశ్రీ పండిట్ అన్నారు. యూసీఈకే ఓక్ ఉత్సవాలు సందర్భంగా వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో శుక్రవారం రెండు రోజుల పాటు నిర్వహించిన రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ఇన్ స్వర్ణాంధ్ర వికసిత్ భారత్-2047 వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య ఉపన్యాసకురాలిగా విచ్చేసిన శాంతిశ్రీ మాట్లాడుతూ నూతన విద్యావిధానం 36 ఏళ్ల తరువాత రూపొందించబడిందని దీని వల్ల ప్రపంచీకరణపై అవగాహన కలుగుతుందని, అంతర్జాతీయ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. పరిశ్రమలకు నైపుణ్యాలతో కూడిన వ్యక్తుల అవసరం ఎంతో ఉందన్నారు. రాబోయే యుద్ధాలను భారతీయ ఇంజనీర్లు తమ శక్తి మేరకు అన్వేషణలను సాగిం వాటిని ఎదుర్కొనేలా సన్నాహమవ్వాలని సూచించారు. అనంతరం హైదరాబాద్‌లోని ఇఫ్లూ వీసీ ఎన్.నాగ రాజు మాట్లాడుతూ భారతదేశంలో మిలియన్‌కు 260 మంది మాత్రమే శాస్త్రీయ నిపుణులుండగా చైనాలో మిలియన్‌కు 1000 మంది ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిశోధనలకు ఎక్కువ నిధులు కేటాయించాలని అధ్యాపకులకు శిక్షణా తరగతులు నిర్వహించి పరిశోధనా ప్రాజెక్టులు చేపట్టేలా ప్రోత్సాహకాలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఐఈపీఏ మాజీ వీసీ జె.బాలగంగాధర్‌తిలక్ మాట్లాడుతూ వికసిత్ భారత్-2047గా అభివృద్ధి చెందాలంటే ఉన్నతవిద్యలో పలుమార్పులు తీసుకురావాలన్నారు. నాలుగేళ్ల డిగ్రీ ప్రోగ్రాంలను ప్రారంభించాలని, నాన్ ఇంజనీరింగ్ సబ్జెక్టులను ప్రవేశపెట్టి సోషల్‌సైన్స్, టెక్నికల్ కోర్సులను కలిపి నేర్పించాలని సూచించారు. పూర్వవిద్యార్థి ఎన్ఎంకే భట్టా మాట్లాడుతూ సోలార్, న్యూక్లియర్, థర్మల్ విద్యుత్ ద్వారా గ్రీన్ ఎనర్జీని పెంపొందించాలన్నారు. ఏపీలో వనరుల కొరత లేదని పరిశ్రమలను స్థాపించుటకు భూసేకరణ చేపట్టాలన్నారు. అనంతరం రోల్ ఆఫ్ అకడమీషియన్స్ టు రియలైజ్ ద ఆబ్జెక్టివ్స్ ఆఫ్ స్వర్ణాంధ్ర వికసిత్ భారత్-2047పై ప్యానల్ చర్చ నిర్వహించారు. దీనికి జేఎన్టీయూకే పూర్వవిద్యార్థి ప్రొఫెసర్ పి.ఉదయభాస్కర్ అధ్యక్షత వహించగా ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, కృష్ణా యూనివర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.రాంజీ, పూర్వ విద్యార్థులు కొండలరావు, నాగిరెడ్డి, ఇడెల్కో సీఈవో శ్రీనివాసప్రసాద్, బీటీహెచ్ స్వీడన్ డైరెక్టర్ గురుదత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ఓక్ జూబ్లీ ఉత్సవాల లోగోను అతిథులు, అధికారులతో కలిసి ఆవిష్కరించి ప్యానల్ నిపుణులను సత్కరించారు. వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో రెక్టార్ వీవీ సుబ్బారావు, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, ఓఎస్డీ కోటేశ్వరరావు, ఓక్ ఉత్సవ కమిటీ చైర్మన్ పి.ఉదయభాస్కర్, వైస్ చైర్మన్ శ్రీనివాసకుమార్, పలువురు డైరెక్టర్లు, యూసీఈకే ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శాంతిశ్రీ పండిట్‌ను సత్కరిస్తున్న దృశ్యం

21న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాసలో ఈ నెల 21న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. వివిధ కంపెనీల్లో స్టోర్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, స్టోర్ ఎగ్జిక్యూటివ్, రైటర్, పర్సనల్ సెక్రటరీ, రిసెప్షనిస్ట్, ఆడిట్ అసిస్టెంట్, టెక్నీషియన్, టెలీ సేల్స్ రిప్రజెంటేటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, సీఏ, ఇంటర్, బీటెక్, ఎంకాం ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల్లోపు వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు సోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలన్నారు.

అనఘా దత్తక్షేత్రంలో శత చండీయాగం

పిఠాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం అగ్రహారం దత్తనగర్‌లోని శ్రీపాదవల్లభ అనఘా దత్త క్షేత్రంలో శత చండీ యాగం శుక్రవారం ప్రారంభమైంది. అంకురార్పణ, ఇతర పూజల్లో మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్తవిజయానంద తీర్థ స్వామి పాల్గొన్నారు. వేద పండితులు క్రతువులు జరిపారు. విజయానంద స్వామి చేపట్టిన చాతుర్మాస్య వ్రత దీక్ష 9వ రోజు కొనసాగింది. జైమినీ భారతంపై ప్రవచించారు.

హాస్టల్ బాలికల ఆకలి కేకలు

- చర్మ వ్యాధులతో బాధపడుతున్న పలువురు విద్యార్థులు
- కలెక్టర్‌కు పెద్దాపురం బీసీ బాలికల వసతిగృహం విద్యార్థినుల ఫిర్యాదు
- కలెక్టర్ ఆదేశాలతో హాస్టల్‌ను తనిఖీ చేసిన ఆర్డీవో శ్రీరమణి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీరమణి

పెద్దాపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం సుధా కాలనీలోని బీసీ బాలికల వసతిగృహంలో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు ఆకలితో అలమటిస్తున్నారు. వార్డెన్ నిత్యం విద్యార్థినుల వేధించడంతో వారి బాధలు వర్ణనాతీతం. 80 మంది విద్యార్థులకు మూడు మరుగుదొడ్లు మాత్రమే ఉండడంతో నిత్యం వారు నరకం చూస్తున్నారు. దీంతో విద్యార్థినులు తాము అనుభవిస్తున్న బాధలను కలెక్టర్ షాన్‌మోహన్ దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణం హాస్టల్‌ను తనిఖీ చేయాలని ఆర్డీవో శ్రీరమణి, ఎంపీడీవో డి.శ్రీలలితను ఆయన ఆదేశించారు. దీంతో వారు హుటాహుటిన హాస్టల్‌కు చేరుకుని విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలికల బాధలు విని తల్లడిల్లిపోయారు. పైగా విద్యార్థినులు చాలా మంది చర్మవ్యాధులతో బాధపడుతున్నట్టు గుర్తించారు. తమ బాధలు చెప్పుకుందామంటే వార్డెన్ తమని బూతులు తిట్టడంతో పాటు కొడుతోందని విద్యార్థినులు వాపోయారు. 80 మంది విద్యార్థినులకు కేవలం మూడు మాత్రమే టాయిలెట్లు ఉండడం పైగా అవి పరిశుభ్రంగా లేకపోవడంతో నిత్యం నరకం చూస్తున్నట్టు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మెను ప్రకారం భోజన పెట్టడంలేదని, తమని దుర్భాషలాడుతున్నట్టు విద్యార్థినులు అధికారులకు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు.

వార్డెన్ విశాలాక్షి సస్పెన్షన్

బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం రాత్రి హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే కలెక్టర్ షాన్ మోహన్‌తో ఫోన్‌లో మాట్లాడి హాస్టల్లో జరుగుతున్న విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, చర్మ వ్యాధులకు వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో కలెక్టర్ స్పందించి వార్డెన్ విశాలాక్షిని సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు. అలాగే మిగిలిన సంక్షేమ వసతి గృహాలను పరిశీలించాలని ఆదేశించినట్టు తెలిపారు. అధికారులు పట్టణ, మండలంలోని దివిలి గ్రామంలో ఉన్న సంక్షేమ వసతి గృహాలను పరిశీలించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

ఒక్క రోజులోనే చిక్కాడు!


రాజోలులో వివరాలు వెల్లడిస్తున్న రాజోలు సీఐ నరేష్‌కుమార్

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

రాజోలులో పట్టుకున్న పోలీసులు

రాజోలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం బి.సావరంలో గురువారం వ్యక్తి చేతిలో మహిళ దారుణ హత్యకు గురైన సంగతి పాఠకులకు విదితమే. పరారీలో ఉన్న నిందితుడు షేక్ షమ్మాను రాజోలులో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. రాజోలు సర్కిల్ పోలీసుస్టేషన్ కార్యాలయంలో సీఐ టీవీ నరేష్‌కుమార్ శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బి.సావరం సిద్ధార్థ నగర్‌లోని ఒక అద్దె ఇంట్లో ఓలేటి పుష్ప (22), షేక్ షమ్మా (22) సహజీవనం చేస్తున్నారు. పుష్ప తన భర్తతో గొడవల కారణంగా విడిపోయి కొడుకు, అమ్మతో కలిసి నివాసం ఉంటుంది. సుమారు సంవత్సరం క్రితం నుంచి రాజోలు కోళ్లవారి గ్రూపునకు చెందిన షేక్ షమ్మాతో పుష్పకు పరిచయం ఏర్పడింది. షమ్మా చెడు అలవాట్లకు బానిసై పుష్పను డబ్బుల కోసం కొట్టేవాడని, గత కొద్ది రోజులుగా కంప్యూటర్ కోర్సు అని చెప్పి అమలాపురం తీసుకువెళుతుండేవాడని సీఐ తెలిపారు. ఈనెల 16న అమలాపురం కంప్యూటర్ కోర్సుకు వెళ్లి వస్తుండగా బోడసకుర్రు బ్రిడ్జిపై షేక్ షమ్మా డబ్బుల గురించి పుష్పతో గొడవపడి కొట్టాడు. ఇంటికి వచ్చిన తరువాత రాత్రి 10.30 గంటల సమయంలో తల్లి గంగమ్మ, తమ్ముడు పుష్పను ఎందుకు కొట్టావని షమ్మాను అడగ్గా మీరెవరు నన్ను అడగడానికి అని షేక్ షమ్మా కబోర్డులో ఉన్న చాకు తీసుకుని పుష్ప తల్లి గంగమ్మ, తమ్ముడిపై దాడి చేసి గాయపరిచాడు. అడ్డు వెళ్లిన ఓలేటి పుష్ప ఎడుమవైపు గుండెపై చాకుతో పొడవగా విపరీతంగా రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందిందని సీఐ తెలిపారు. పుష్ప తల్లి గంగమ్మ ఫిర్యాదు మేరకు రాజోలు ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న షేక్ షమ్మా కోసం గాలింపు చేపట్టారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ పర్యవేక్షణ చేస్తూ రెండు టీమ్‌లు ఏర్పాటు చేశారు. రాజోలు సీఐ నరేష్‌కుమార్, ఎస్‌ఐ రాజేష్‌కుమార్, సిబ్బంది కలిసి శుక్రవారం సాయంత్రం షేక్ షమ్మాను రాజోలులో అతడి ఇంటి వద్ద అరెస్టు చేశారు. నిందితుడిని ఒక్కరోజులోనే పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ కృష్ణారావు అభినందించారు. షమ్మాను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని సీఐ నరేష్‌కుమార్ చెప్పారు.

ఆహా.. ఆషాఢం సారె

తలుపులమ్మకు అన్నవరం దేవస్థానం నుంచి సమర్పణ


కాకినాడ జిల్లా లోవ క్షేత్రంలో తలుపులమ్మకు సారె తీసుకొచ్చి సమర్పిస్తున్న అన్నవరం దేవస్థానం ఈవో, అధికారులు

తునిరూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాస ఆఖరి శుక్రవారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు కాకినాడ జిల్లా లోవ క్షేత్రంలో గల తలుపులమ్మ అమ్మవారికి చీర, సారె సమర్పించారు. అమ్మవారికి అన్నవరం దేవస్థానం నుంచి ఈవో సుబ్బారావు చీర, సారె సమర్పించారు. వారికి ఆలయ అధికారులు మంగళవాయిద్యాలుతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. ఈనెల 24న అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో విశేష హోమ అభిషేకం జరుగుతుందని అధికారులు తెలిపారు.


శంఖవరం: కత్తిపూడిలో కనక దుర్గమ్మకు శుక్రవారం ఘనంగా ఆషాఢం సారె, బోనాలు సమర్పించారు.


ప్రత్తిపాడు: ధర్మవరం సూర్యారావుపేటలో దుర్గతల్లి గుడి వద్ద మహిళలు భారీ సారె సమర్పించారు.

నెయ్యి డబ్బాలు దొంగిలిస్తుంటే పట్టివేత...

అన్నవరంలో ఉప ప్రధాన అర్చకుడు, పరిచారకుడు సస్పెండ్


నెయ్యి డబ్బాలతో పట్టుబడిన ఉప ప్రధాన అర్చకుడు హరగోపాల్

ఈవో సుబ్బారావు ఉత్తర్వులు

అన్నవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో నెయ్యి డబ్బాలను దొంగిలిస్తూ పట్టుబడిన ఉప ప్రధాన అర్చకుడు హరగోపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఆలయ ఈవో సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. సత్యదేవుడి తొలిపావంచా వద్ద కనకదుర్గ ఆలయంలో ఉప ప్రధాన అర్చక హోదా కలిగిన చిట్టెం హరిగోపాల్ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో హోమాలు, దీపారాధన తదితర వాటికి వినియోగించాల్సిన 3 డబ్బాల నెయ్యిని శుక్రవారం ఎటువంటి అనుమతి లేకుండా కారులో తరలించే ప్రయత్నం చేయడంతో ఈవోకు అందిన సమాచారంతో ఆయన ఆదేశాలతో ఏఈవో భాస్కర్ హుటాహుటిన వెళ్లి నిర్ధారించి ఈవోకు నివేదించారు. దీంతో అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పట్టుబడిన నెయ్యి డబ్బాల విలువ రూ.27వేలుగా అధికారులు తెలిపారు. 3 డబ్బాలను విచారణాధికారులు స్వాధీనం చేసుకుని దేవస్థానం సెంట్రల్‌స్టోర్స్‌కి తరలించారు. గతేడాది పదవీ విరమణ చేయాల్సిన సమయంలో ప్రభుత్వ జీవో కారణంగా ఆయన విధుల్లో కొనసాగుతున్నారు. ఆది నుంచి అర్చకుడు వివాదాస్పదంగానే విధులు నిర్వహిస్తుండడం విశేషం. గతంలో ఒకసారి అతడు పనిచేసే వనదుర్గ ఆలయ తాళాలు ఇంటికి పట్టుకెళ్లిన సంఘటనను సహచర అర్చకులు గుర్తుచేస్తున్నారు. అలాగే ఇదే సంఘటనలో అదే ఆలయంలో పరిచారకుడిగా పనిచేస్తున్న ఎన్ఎస్.సుబ్రహ్మణ్య కృష్ణకుమార్‌ను కూడా సస్పెండ్ చేశారు.

‘అన్నవరం’ సూపరింటెండెంట్‌కు ఏఈవోగా పదోన్నతి

అన్నవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అనకాపల్లి ప్రసాద్‌కు ఏఈవోగా పదోన్నతి కల్పిస్తూ ఈవో వీర్ల సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానం ఉద్యోగుల సంఘం నాయకుడిగా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ప్రసాద్‌కు దేవస్థానం ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

బైక్‌లు దొంగిలిస్తున్న ముగ్గురి అరెస్టు


అన్నవరం పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

అన్నవరం/శంఖవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన ముగ్గురు జువైనల్స్ అన్నవరం పరిసర ప్రాంతాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడడంతో వారిని శుక్రవారం అరెస్టు చేసినట్టు అన్నవరం ఎస్‌ఐ హరిబాబు తెలిపారు. నిందితుల నుంచి 4 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని వారిని రాజమండ్రి ప్రొబిషనరీ అధికారి ముందు హాజరుపరిచామని, స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ హరిబాబు చెప్పారు.

ఒకే కుటుంబంలో నలుగురు అదృశ్యం

పట్టుకున్న కిర్లంపూడి పోలీసులు


అదృశ్యమైన వారిని పట్టుకున్న పోలీసులు

కిర్లంపూడి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు, బాలుడు, బాలిక ఆత్మహత్య చేసుకుంటామని చెప్పి 2024 నవంబరు 9న అర్ధరాత్రి అదృశ్యమయారు. దీనిపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు పర్యవేక్షణలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో కిర్లంపూడి ఎస్‌ఐ జి.సతీష్, సిబ్బంది గురు శ్రీ, శివప్రసాద్ మహారాష్ట్రలోని సోలాపూర్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలించి ఆ నలుగురిని పట్టుకున్నారు. వారిని వెతికి పట్టుకోవడంలో విశేష కృషి చేసిన ఎస్‌ఐ సతీష్ బృందాన్ని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

వ్యక్తికి తీవ్రగాయాలు

అంబాజీపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు మలుపు వద్ద మారుతికారును ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పుల్లేటికుర్రు ఆంధ్రబ్యాంకు దాటిన తరువాత ఉన్న మలుపు వద్ద ముక్కామల నుంచి కె.పెదపూడి వైపు వెళ్తున్న కారును అమలాపురం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జుకావడంతో పాటు కారులో ఉన్న కె.పెదపూడి గ్రామానికి చెందిన సత్తిరాజాకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని అమలాపురం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.


ప్రమాదానికి గురైన కారు

సీపీఎస్ పరిధిలోకి తీసుకోవాలి

కలెక్టరేట్ ఎదుట డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం ధర్నా


కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయుల ఫోరం ప్రతినిధులు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 18 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానం అమలు తేదీ కంటే ముందే వెలువడిన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగానికి ఎంపికైన వారిని సీపీఎస్ పరిధిలోకి తీసు కోవాలని ప్రభుత్వ ఉద్యోగులు కాకినాడ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. డీఎస్సీ- 2003 ఉపాధ్యాయుల ఫోరం ఉమ్మడి తూర్పు గో దావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉపాధ్యాయుల ఫోరం కన్వీనర్ జయరామ్ మాట్లాడుతూ సీపీఎస్‌కు ముందే నోటిఫికేష న్ విడుదల అయినప్పటికీ వివిధ కారణాల వల్ల ఉద్యోగంలోకి ఆలస్యంగా చేరిన ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఈ సమస్యలను గత ప్రభుత్వంలో ప్రస్తావించినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఉద్యోగులు విభాగాల వారీగా పరిశీలిస్తే విద్యాశాఖలో 7361 మంది, హోంశాఖలో 1821 మంది, గ్రూప్-1, గ్రూప్-2లో 1800 మంది ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో తమను సీపీఎస్ పరిధిలోకి తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు చలపతి, ఉపాధ్యాయులు ఫోరమ్ ప్రతినిధులు జయ కృష్ణారెడ్డి, శ్రీలక్ష్మీ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు

కాకినాడ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు కోరారు. ఉద్యోగుల కోసం కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రత్యేకంగా నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు డీఆర్వో వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. హెల్త్‌కార్డుల కోసం కార్పొరేట్ హాస్పిటల్స్ నిర్వాహకులు, ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కొందరు ఉద్యోగుల బదిలీల్లో ఏర్పడిన ఇబ్బందులను తొలగించాలన్నారు. అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి యెరుబండి రామ కృష్ణ, కాకినాడ నగర శాఖ అధ్యక్షుడు అరదాడి సత్తిరాజు, కార్యదర్శి డి.రామ్మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా స్కూల్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవికు మార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతి


మరణించిన మరియమ్మ

తాళ్లరేవు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా చొల్లంగి జాతీయ రహదారి గురజనాపల్లి సెంటరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పులపకూర మరియమ్మ (49) మృతిచెందినట్టు కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం.. చొల్లంగి గ్రామానికి చెందిన మరియమ్మ తన మనవరాలుని 6వ తరగతిలో చేర్పించేందుకు సీటు కోసం చొల్లంగిపేట గురుకుల పాఠశాలకు వెళ్లేందుకు గురజనాపల్లి సెంటరులో 216 రహదారిని దాటుతుండగా యానాం నుంచి వచ్చే ద్విచక్రవాహనం ఆటోను తప్పించబోయి మరియమ్మను ఢీకొంది. ఆమెను తీవ్రగాయలు కాగా అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతిచెందింది. కోరింగ ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రిపై సుత్తితో కొడుకు దాడి

కేసు నమోదు


గాయపడిన గంటా శ్రీను

రాయవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తనను మందలించాడని తండ్రి తలపై కొడుకు సుత్తితో విచక్షణ రహితంగా దాడి చేసి గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు శుక్రవారం రాయవరం ఎస్‌ఐ డి.సురేష్ బాబు తెలిపారు. కోనసీమ జిల్లా రాయవరం రాజేశ్వరకాలనీకి చెందిన గంట శ్రీను తన కుమారుడు గంటా పవన్ కల్యాణ్‌ను ప్రతి రోజు తిడుతున్నాడు. ఈనెల 17న రాత్రి శ్రీను భోజనం చేస్తున్న సమయంలో తండ్రి కొడుకులు మరోసారి గొడవపడడంతో ఆగ్రహంతో పవన్‌కల్యాణ్ తన తండ్రి శ్రీనుపై సుత్తితో తలపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపర్చాడు. శ్రీను ఇచ్చిన ఫిర్యాదుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

చిన్నాన్నే చిదిమేశాడు!

పదేళ్ల బాలికపై ఏడాదిగా అత్యాచారం

పోక్సో కేసు నమోదు

కాకినాడ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తండ్రి స్థానంలో ఉండాల్సిన చిన్నాన్న కామంతో కళ్లు మూసుకుపోయి వరసకు కూతురైన 10 ఏళ్ల బాలికపై ఏడాది కాలంగా అత్యాచారానికి పాల్పడుతున్న సంఘటన బయటపడింది. వివరాల్లోకి వెళితే... కాకినాడ వెంకట్‌నగర్‌కు చెందిన గాది వెంకన్న(30)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా అతడు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ ఉంటాడు. అతడి భార్యకు ఇద్దరు అక్కలున్నారు. పెద్దక్క భర్త తాగుడుకి బానిసై ఇంటిని పట్టించుకోకపోవడంతో 5వతరగతి చదువుతున్న తన పదేళ్ల కుమార్తెను చిన్న చెల్లికి అప్పగించి తాను ఇళ్ల పనులకు వెళుతూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో అవకాశంగా తీసుకున్న చిన్న చెల్లి భర్త వెంకన్న ఆ బాలికకు తినుబండారాలు, ఆట వస్తువులు కొనిపెడుతూ మచ్చిక చేసుకుని ఏడాది కాలంగా పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఒక వేళ ఈ విషయం ఎవరికైనా చెప్పితే చంపేస్తానని బెదిరించాడు. అయితే గురువారం వెంకన్న అత్యాచారానికి పాల్పడుతుండగా బాధితురాలి చెల్లి ఎనిమిదేళ్ల బాలిక ఆ సంఘటనను చూసి విషయాన్ని తన తల్లికి చెప్పింది. వెంటనే ఆమె గురువారం రాత్రి స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ మజ్జి అప్పలనాయుడు పోక్సో కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధిత బాలికను వైద్య పరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ వ్యవహరిస్తున్నారు.

విద్యుదాఘాతానికి కార్మికుడు దుర్మరణం


విద్యుత్ స్తంభంపై మృతిచెందిన కార్మికుడు

సామర్లకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట-పిఠాపురం రోడ్డులో విద్యుత్ లైన్లు మార్చేందుకు ప్రైవేట్ కాంట్రాక్ట్ సిబ్బంది పనులు చేస్తుండగా డబుల్ ఫీడర్ అయిన 11 కేవీఏ విద్యుత్ లైన్‌ను తాకడంతో సామర్లకోట గణేష్‌కాలనీకి చెందిన నులకా భేతాళ్ళ(32) అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ముందుగా అందించిన సమాచారం మేరకు విద్యుత్ లైన్లు మార్చే ఫీడర్‌కు చెంది విద్యుత్ సరఫరా నిలుపుదల చేసినప్పటికీ రెండో వైపు నుంచి విద్యుత్ సరఫరా అవుతుందని భావించకుండా నిర్లక్ష్యంగా కాంట్రాక్టర్ వ్యవ హరించడంతో విద్యుత్ ఘాతానికి కార్మికుడు భేతాళ్ళ మృతిచెందినట్టు పలువురు భావించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా శుక్రవారం జరిగిన సంఘటనలో ప్రైవేట్ కాంట్రాక్ట్ కార్మికుడు విద్యుత్ ఘాతానికి మృతి చెందడం తమ శాఖకు ఎంత మాత్రం సంబంధం లేదని కాంట్రాక్టర్ ముందుగా లైన్లలో పనులు చేస్తున్నపుడు పరిశీలన చేసు కోవాల్సిఉందని విద్యుత్ ఏడీఈ కిరణ్ పేర్కొన్నారు.

మత్తులో వ్యక్తి దాడి : మహిళ మృతి


గంగమ్మ (ఫైల్)

కూనవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి మహిళపై దాడి చేయడంతో మృతిచెందిన సంఘటన అల్లూరి కూనవరం మండలం చింతగండిలో జరిగింది. గ్రామానికి చెందిన చదల కన్నపురెడ్డి కల్లు కోసం ఆ గ్రామంలో గురువారం రాత్రి సమయంలో గొడవ చేశాడు. ఎవరు మందలించినా వాగ్వాదానికి దిగాడు. అదే గ్రామానికి చెందిన వాళ్ల గంగమ్మ (45)తో గొడవ పెట్టుకున్నాడు. ఆమెపై కర్రతో బలంగా కొట్టడంతో అక్కడే మృతిచెందింది. అడ్డు వచ్చిన గంగమ్మ భర్త చిన్న భీమ్ రెడ్డిపై దాడి చేయడంతో చేతికి గాయమైంది. ఈ సంఘటనపై మృతురాలి కుమారుడు మాధవ రెడ్డి కూనవరం పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ లతాశ్రీ కేసు నమోదు చేశారు. చింతూరు సీఐ దుర్గాప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులా పాఠశాల... మరి చదువెలా!

ఏలేశ్వరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఈ ఫొటోను చూశారా.. చెరువు కాదండోయ్.. పాఠశాల ఆవరణే.. కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో ఏలేశ్వరం బాలికోన్నత పాఠశాల ఆవరణలోకి నీరు చేరింది. దీంతో విద్యార్థులు ఆ నీటిలోనే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాలకులు పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు డ్రైనేజీ ద్వారా బయటకు వెళ్లే ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చూపారు. దీంతో ఈ పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండటం పరిపాటిగా మారింది. పర్యావరణం, పరిశుభ్రత అంటూ చూచనలు ఇచ్చే ఉపాధ్యాయులే విద్యార్థులను ఈ మురుగు నీటిలో పాఠశాలకు ఎలా రమ్మనాలో అయోమయంలో ఉన్నారు.



సామర్లకోట విద్యుత్ సిబ్బందిపై చర్యలు!

సామర్లకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట విద్యుత్ సిబ్బంది ఇద్దరిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ నుంచి కాకినాడ జిల్లా విద్యుత్ ఉన్నతాధికారికి శుక్ర వారం సాయంత్రం ఆదేశాలు అందినట్టు విశ్వసనీయ సమాచారం. ఈనెల 17న ఆంధ్రజ్యోతిలో తల్లికి ఆనందమేది పేరిట కథనం ప్రచురితమైన విషయం విదితమే. సొంతిల్లు అయినా లేని తన పేరిట 40 విద్యుత్ సర్వీసులు ఉన్నట్టు నమోదులు కావడం వల్లే తన ఇద్దరు చిన్నారులకు తల్లికి వందనం పథకం రాలేదని మహిళ కటకం నాగ సత్య గంగాభవాని ఆవేదనపై ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చింది. ఇప్పటికే ఈ వివాదానికి చెంది విద్యుత్ ఏఈ అమలాపురం కన్‌స్ట్రక్షన్ సెక్షన్‌కు బదిలీ అయిన విషయం విదితమే. కింది స్థాయి సిబ్బంది తప్పిదం కూడా ఉండడం వల్ల మహిళకు అన్యాయం జరిగినట్లు సీఎండీ కార్యాలయం అధికారులు భావించారు. దీంతో సామర్లకోట పట్టణ లైన్ ఇన్ స్పెక్టర్, లైన్‌మెన్‌పై సస్పెన్షన్ విధించాలని ఆదేశాలు కాకినాడ జిల్లా ఉన్నతాధికారికి అందినట్టు తెలిసింది.

బీచ్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ మృతదేహం


కల్యాణి (ఫైల్)

సర్పవరం జంక్షన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సూర్యా రావు పేట ఎన్టీఆర్ బీచ్‌లో శుక్రవారం ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. కాకినాడ రామారావు పేట చర్చి స్ట్రీట్ సుబ్బయ్య హోటల్ సమీపంలో నివసిస్తున్న కారం కల్యాణి (37)గా తిమ్మాపురం పోలీసులు గుర్తించారు. ఆమె కాకినాడ నగరపాలక సంస్థలో ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. భర్త పాము ఉదయ్ కుమార్ ప్రభుత్వ ఉద్యోగి. భర్త మృతి చెందడంతో కుమారుడికి కారుణ్య నియామకం కింద ప్రభుత్వం కోనసీమ జిల్లా అల్లవరం మండలం గుడిలంకలో గ్రామ సర్వేయర్‌గా ఉద్యోగం ఇచ్చారు. భర్త మృతి చెందినప్పటి నుంచి మానసికంగా కుంగిపోయి మానసిక సమస్య ఒత్తిడి, అనారోగ్య సమస్యతో బాధపడటంతో బీచ్‌కెళ్లి సముద్రంలో పడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. సూర్యా రావుపేట వీఆర్వో సమాచారం మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తిమ్మాపురం ఎస్‌ఐ వై గణేష్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

అక్రమంగా ఆయిల్ దిగుమతి

నలుగురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న ట్యాంకర్లతో పోలీసులు

అన్నవరం/శంఖవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఆయిల్ దిగుమతి చేస్తున్న నలుగురు వ్యక్తులను అన్నవరం పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి శివార్లలో దుర్గాడ సమీపంలో గురువారం ఆయిల్ దిగుమతి చేస్తుండగా లారీలపై దాడి చేసి అదుపులోకి తీసుకున్న విషయం విదితమే. ఈ దాడుల్లో పట్టుకున్న ట్యాంకర్లలో 9800 లీటర్ల ఆయిల్ ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. 2 ట్యాంకర్లు, ఆయిల్ తోడే మిషనుతో స్వాధీనం చేసుకుని నలుగురి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే పోలీస్ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడ జిల్లా తుని ఎల్ఐసీ ఆఫీస్ ఎదురుగా మూతబడిన రైల్వే గేట్ వద్ద రైలు పట్టాలపై తుని వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్లే రైలు ఢీకొని 50 ఏళ్ల వ్యక్తి మరణించాడు. నలుపు తెలుపు నీలం అడ్డచారల్ ఆఫ్ చేతుల టీ షర్ట్, లుంగీ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని తుని ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిస్తే 9490619020 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

అమలాపురం

సాంకేతిక విద్యపై ఆసక్తిని పెంపొందించాలి

● డీఈవో సలీంబాషా

అమలాపురంరూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సాంకేతిక విద్య పట్ల ఆసక్తిని పెంపొందించి సంబంధిత పరికరాలు వినియోగించే విధంగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా సూచించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల వినియోగం 40శాతం నుంచి నూరుశాతం జరిగేలా చూడాలన్నారు. జిల్లాలోని 45 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు పూర్తిస్థాయిలో క్రియాశీలకంగా పనిచేసేందుకు విజయవాడ సెయింట్ మేరీ స్టెల్లా కళాశాలలో ప్రత్యేక వర్కుషాపు నిర్వహించారు. ప్రతీ ఐదు ల్యాబ్‌లకు ఒక రిసోర్సు పర్సన్‌ను నియమించగా జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం నేతృత్వంతో 11 మంది రిసోర్సు పర్సన్ల బృందం వర్కుషాపులో పాల్గొన్నారు. అటల్ ల్యాబ్స్‌లో అందుబాటులో ఉన్న పరికరాల ఆధారంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రాజెక్టు ఆధారిత విద్యను అందించే విధానం, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న రిసోర్సు పర్సన్లు జిల్లాలో మూడు రోజుల పాటు ప్రత్యేక వర్కుషాపు నిర్వహించి ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు.


విజయవాడలో శిక్షణ పూర్తి చేసుకున్న రిసోర్సు పర్సన్లు

కలిసి పనిచేద్దాం: ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జనసేన నాయకురాలు ఓగూరి భాగ్యశ్రీ నియామకం అభినందనీయమని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మురమళ్ళ క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం భాగ్యశ్రీతో పాటు నియోజకవర్గ జనసేన నాయకులు బుచ్చిబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తొలుత ఈ పదవి జనరల్ కావడంతో టీడీపీకి చెందిన తాడి నరసింహారావు పేరు ప్రభుత్వానికి నివేదించామన్నారు. అయితే మారిన పరిస్థితిలో ఎస్సీ మహిళకు రిజర్వు చేసినట్టు బుచ్చిబాబు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గుద్దటి జమ్మి, గోదాసి పుండరీష్, గొలకోటి సాయిబాబు,కూటమి నాయకులు గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, నడింపల్లి సుబ్బరాజు, దాట్ల పృధ్వీరాజు, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బుచ్చిబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న భాగ్యశ్రీ

ఎమ్మెల్యేకు ఏఎంసీ చైర్మన్ కతజ్ఞతలు

కాట్రేనికోన, జూలై 18(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఓగూరి భాగ్యశ్రీ శుక్రవారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పూడి సర్పంచ్ రంబాల రమేష్, నూకల మూర్తి, నూకల దుర్గబాబు, మోకా బాలప్రసాద్, రంబాల చౌదరి, ర్యాలి బద్రి తదితరులున్నారు.

సొసైటీ చైర్మన్‌గా బాలకృష్ణ ప్రమాణస్వీకారం

ఉప్పలగుప్తం, జూలై 18(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి సొసైటీ పాలకవర్గం శుక్రవారం ప్రమాణస్వీకారం చేసింది. చైర్మన్‌గా జనసేన నాయకుడు మంచెం బాలకృష్ణ, సభ్యులుగా తోకల సుబ్బారావు, పాటి సత్యనారాయణలతో సీఈవో మంచెం బాబి ప్రమాణస్వీకారం చేయించారు. తొలుత చైర్మన్ బాలకృష్ణ ఊరేగింపుగా సొసైటీకి చేరుకున్నారు. అనంతరం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చైర్మన్ బాలకృష్ణ, సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ గొలకోటి సత్తిరాజు, జనసేన గ్రామకమిటీ అధ్యక్షుడు గుత్తాల సుభాష్‌చంద్రరావు, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ తో పాటు కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


గొల్లవిల్లి సొసైటీ పాలకవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

'బిజినెస్ కరస్పాండెంట్ పాయింట్ సేవలు వినియోగించుకోవాలి'

మామిడికుదురు, జూలై 18(ఆంధ్రజ్యోతి): బ్యాంకు సర్వీసు పాయింటు అందిస్తున్న సేవలను వినియోగదారులు వినియోగించుకోవాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. పాశర్లపూడిలోని బ్యాంక్ ఆఫ్ బరోసా బిజినెస్ కరస్పాండెంట్ పాయింట్‌ను బ్యాంకు మేనేజర్ రాజాతో కలిసి అమలాపురం ఎంపీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా అందించే సేవలు అన్నీ ఈ పాయింటు ద్వారా పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, నాయకులు చుట్టుగుళ్ల కిశోర్, తులా బ్రహ్మజీ, మేడేపల్లి చినసత్యనారాయణ, కొల్లు ఏడుకొండలు, గుత్తుల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పాశర్లపూడిలో బ్యాంకు పాయింట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్

వ్యాయామంపై శ్రద్ధ వహించాలి

● బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం

రాజోలు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో వ్యాయామంపై శ్రద్ధ చూపించాలని న్యూ ఆంధ్ర బాడీబిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం అన్నారు. శుక్రవారం పొదలాడలో రియల్ జిమ్‌లో న్యూ ఆంధ్ర బాడీబిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూరంపూడి త్రిమూర్తులు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమంలో షేక్ ఖాసింను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రియల్ జిమ్ అధినేత సూరంపూడి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతీరోజు ప్రతీఒక్కరు వ్యాయామం చేయడం వల్ల ఫిట్‌నెస్‌గా ఉంటారని అనారోగ్య సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో న్యూ ఆంధ్ర బాడీబిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కట్టా శ్రీను, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉల్లూరి విజయ్‌కుమార్, జిల్లా యానం సెక్రటరీ జీవన్, తెన్నేటి కిశోర్, కాండ్రేగుల కృష్ణ, గుత్తుల శ్రీను, అనుచూరి రవి, కంబాల చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి సుపరిపాలనలో అందరికీ సంక్షేమం

● ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

ఉప్పలగుప్తం, జూలై 18(ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది సుపరిపాలనతో అన్నివర్గాలకు సంక్షేమం అందుబాటులోకి వచ్చిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. పెదగాడవిల్లి, చినగాడవిల్లి గ్రామాల్లో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఎంపీటీసీ నిమ్మకాయల రాము, టీడీటీ మండల కార్యదర్శి పండు వెంకటేశ్వరరావు, భీమనపల్లి సొసైటీ చైర్మన్ ఆకేటి పెద్ద, నీటిసంఘం చైర్మన్ ఆకుల వెంకటరమణ, సలాది పట్టాభి, నిమ్మకాయల రామారావు, అడపా అవినాష్, కోటిపల్లి రాంబాబు, నూకల రాజా, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, గుత్తుల శ్రీనివాసరావు, వాసంశెట్టి శ్రీనివాసరావుపాల్గొన్నారు.


పెదగాడవిల్లిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

జనరంజకంగా కూటమి సుపరిపాలన

అల్లవరం: టీడీపీ కూటమి సుపరిపాలన ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీల మేరకు జనరంజకంగా సాగుతుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. శుక్రవారం అల్లవరం మండలం తుమ్మలపల్లిలో టీడీపీ సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

అమలాపురం రూరల్ : అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో శుక్రవారం జనుపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చొల్లంగి సత్యసాయిబాబా, దేవరపల్లి వీరేశ్‌కుమార్‌లతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి సుపరిపాలనలో తొలిఅడుగు కరపత్రాలు పంపిణీచేశారు. స్థానిక సమస్యలను మై టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. గ్రామకమిటీ అధ్యక్షుడు కర్రి దుర్గారావు, మాజీ ఎంపీటీసీ వాకపల్లి వెంకయ్య నాయుడు, ఈతకోట నాగేశ్వరరావు, మట్టా మహలక్ష్మిప్రభాకర్, అధికారి బాబ్జి, నడింపల్లి ఉదయబాబు, రాజు, కైరం రాము పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి : ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురు, జూలై 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పాశర్లపూడిలంకలో ఎన్‌ఆర్‌ఈఎస్ నిధులు రూ.1.20 కోట్లతో నిర్మించే రోడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మంచినీరు, పెన్షనర్లు, రహదారులతో పాటు లోఓల్టేజ్ సమస్య ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తేగా వాటిని సత్వరమే పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలోసర్పంచ్‌లు అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కోలా సత్తిబాబు, పితాని వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలుగా మారితే జీవితం నిరర్థకం

● అమలాపురం డీఎస్పీ ప్రసాద్

అమలాపురం రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిసలుగా మారితే జీవితం దుర్భరంగా మారుతుందని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పేర్కొన్నారు. గంజాయి, మత్తుకు బానిసలైన యువత కుటుంబాలు పడుతున్న మనోవేదనను ప్రతీ విద్యార్థి గుర్తించాలన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనార్థాలు వివరిస్తూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ ప్రసాద్ మాట్లాడారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను అమలాపురం తాలూకా సీఐ బి.ప్రశాంత్ కుమార్ వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, ఫిజికల్ డైరెక్టర్ కె.రవిసుధీర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి

అమలాపురం టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లంతా ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని అమలాపురం మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ సూచించారు. నో ఎంట్రీ ఉన్న ప్రాంతాల్లో ఆటోలను నడపడం గానీ, పార్కింగ్ చేయడం గానీ చేయరాదన్నారు. మున్సిపల్ గైడ్‌లైన్స్‌ను విధిగా పాటించాలన్నారు. పట్టణంలో సైలెంట్ జోన్స్‌గా ఉన్న కోర్టు, పాఠశాలలు, హాస్పిటల్స్ వద్ద ఆటోలను ఇష్టానుసారం నడపడం, పార్కింగ్ చేయడం పూర్తిగా నిషేధమన్నారు. శుక్రవారం ఆటో యూనియన్ ప్రతినిధులతో మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఈఈ కెవీవీ సత్యనారాయణ, టీపీవో బి.రాణిసంయుక్త, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు, కార్యదర్శి ఊటాల వెంకటేష్, అమలాపురం డివిజన్ సంఘ అధ్యక్షుడు బొక్కా నాని, కార్యదర్శి బి.ఫణీంద్ర పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

● సామాజిక తనిఖీల్లో గుర్తింపు

అయినవిల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంకు సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. మండలంలో 21 గ్రామాల్లో ఎస్ఎస్ఏ, ఫారెస్ట్, పంచాయతీరాజ్ తదితర 929 పనులను రూ.12,45,35,482 వ్యయంతో నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగినట్టు సామాజిక తనిఖీల్లో గుర్తించారు. శంకరాయగూడెంలో కాలువలో నీరు ఉండగా రూ.20లక్షలతో కాలువపనులు చేసినట్టు, మడుపల్లిలో కొబ్బరిచెట్ల పళ్లాల నిమిత్తం రూ.20,03,600 చేయని పనులు చేసినట్టు చూపి అవకతవకలకు పాల్పడ్డట్టు గుర్తించారు. అటవీశాఖ మొక్కలు రూ.40వేలు విలువ గలవి నాటకపోవడం, పలు గ్రామాల్లో మస్తర్లు వేయకపోవడం, ఎంబుక్‌లు రికార్డు చేయకపోవడం, చేసిన పనులకు కొలతలు తీయకపోవడం సామాజిక తనిఖీల్లో బయటపడ్డాయి. ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, పీడీ మధుసూదనరావు, ఎంపీడీవో రాంబాబు, ఎస్ఆర్పీ వెంకటేశ్వరరావు, ఏవో సత్యనారాయణ, ఏపీవో అనంతలక్ష్మి, ఎంపీడీవో సరోవరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకపోతే పనులు నిలిపివేస్తాం

మలికిపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనాలు వారం రోజుల్లో చెల్లించకపోతే పనులు నిలిపివేస్తామని ఉపాధి కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు అన్నారు. ఉపాధి మేట్ ఎం.రమాదేవి అధ్యక్షతన జరిగిన కూలీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండునెలల నుంచి వేతనాలు అందక కూలీలు చాలా ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు. సమావేశంలో మల్లాడి రమాదేవి, రమేష్, అన్నవరం, దేవి, వి.సత్యనారాయణ, బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ఆషాడం సారె

పి.గన్నవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ముంగండ గ్రామ దేవత శ్రీముత్యాలమ్మతల్లి శుక్రవారం శాకాంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి వివిధ రకాల స్వీట్లను సారెగా సమర్పించారు. ఉదయం కూరగాయలతో అమ్మవారిని శాకాంబరిగా ప్రత్యేక అలంకరణ చేసిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఐ.పోలవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలో 43మందికి మంజూరైన రూ.30,07,207ల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు శుక్రవారం మురమళ్ళలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తుల సాయి, చెల్లి అశోక్, నడింపల్లి సుబ్బరాజు, పొద్దోకు బాలు, గొలకోటి దొరబాబు, ధూళిపూడి వెంకటరమణ, చిక్కాల అంజిబాబు, వనచర్ల వెంకటేశ్వరరావు, ఏలూరి మూర్తి, మాణిక్యం పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆర్యవైశ్య సంఘ సమావేశం

అంతర్వేది, జూలై 18(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం గ్రామంలో వాసవీక్లబ్ ఆర్యవైశ్య సంఘ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. తొమ్మిది గ్రామాల ఆర్యవైశ్యులంతా కలిసి భారీ సమావేశం ఏర్పాటుచేశారు. అంతర్వేది, తూర్పుతాళ్లు, మొగల్తూరు, నర్సాపురం, హైదరాబాద్ నుంచి కాప్ర, మదీనాగూడ నుంచి వచ్చిన పలువురు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేసి సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్వేది అధ్యక్షుడు పి.నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు నూలు శ్రీనివాస్, సభాధ్యక్షుడు, రీజనల్ ఛైర్‌పర్సన్ వంకాయల శ్యామల, రవికుమార్, బద్రి, సతీష్ పాల్గొన్నారు.

గొల్లపాలెం అభివృద్ధికి పాటుపడతా: ఎమ్మెల్యే దేవ

మలికిపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): గొల్లపాలెంలో పరిశ్రమలు స్థాపించి పారిశ్రామికవాడగా తీర్చిదిద్దుతానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం గొల్లపాలెంలో గ్రామాభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గొల్లపాలెంలో కోకోనట్ పార్కు ఏర్పాటుకు ఇప్పటికే పలుమార్లు స్థానిక రైతులను స్థల సేకరణ కోసం సంప్రదిస్తామన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో పీతల హేచరీ ఏర్పాటుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుందని నివేదికలు చెబుతున్నాయని, త్వరలో స్థల సేకరణచేసి ఈ ప్రాంతంలో పీతల హేచరీ ఏర్పాటుచేస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. హేచరీ ఏర్పాటుకు ఐదు ఎకరాల స్థలం కావాలని మీరంతా సహకరించాలని కోరారు. కొద్దిరోజుల్లో ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ ఛైర్మన్ కూడా ఇక్కడికి వస్తారన్నారు. రాజోలు నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో సమస్యలపై అవగాహనతో ముందుకు వెళుతున్నామన్నారు. సమావేశంలో సర్పంచ్ మందపాటి నాగేశ్వరరావు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ఎంపీటీసీ అనంతలక్ష్మి, ఎలుమర్తి బాబూజీ, రాపాక వెంకటనానాజీ, యెనుముల నాగు, పెదకాపు, దిరిశాల బాలాజీ, గ్రామశాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సూరిబాబు, తహశీల్దార్ శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ బి.ప్రసాద్ పాల్గొన్నారు.


గొల్లపాలెంలో మాట్లాడుతున్న రాజోలు ఎమ్మెల్యే దేవ

బలవంతపు వసూళ్లకు పాల్పడొద్దు

అవసరం కోసం ప్రైవేటు బ్యాంకుల వద్ద రుణాలు తీసుకుంటే వారు బలవంతపు వసూళ్లతో రాజోలు నియోజకవర్గంలో పలువురు ఆత్మహత్యలకు, బలవన్మరణాలకు పాల్పడడం శోచనీయమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం విశ్వేశ్వరాయపురంలో ఆయన ఇంటి వద్ద జరిగిన రుణ బాధితుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రైవేటు బ్యాంకులు అప్పులు ఇచ్చి చట్ట పరిధిలో కాకుండా రుణాల వసూళ్లలో బలవంతాలకు పాల్పడడం సరికాదన్నారు. పోలీసులు కూడా ఇటువంటి సంఘటనలపై ఫిర్యాదులు అందితే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రైవేటు బ్యాంకులు రుణాల వసూళ్లలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలోపలువురు బాధితులు పలు గ్రామాల నుంచి వచ్చి ప్రైవేటు బ్యాంకు దాడులు, దోపిడీల గురించి ఏకరువు పెట్టారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెదకాపు, ఎన్నారై యెనుముల వెంకటపతిరాజా, సూరిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు భీమకవి చంద్రరావు సమగ్ర కవిత్వ ఆవిష్కరణ సభ

అమలాపురం టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీన అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో ప్రముఖ రచయిత, భీమకవి చోడగిరి చంద్రరావు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ సభ నిర్వహిస్తున్నట్టు బుద్ధవిహార్ ఛైర్మన్ నాగాబత్తుల ప్రసాదరావు తెలిపారు. కవిత్వ సంపుటిని మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆవిష్కరిస్తారని, ఆత్మీయ అతిథులుగా ఆచార్య శిఖామణి, జి.లక్ష్మీనర్సయ్య, డాక్టర్ కోయ వెంకటేశ్వరరావులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీబీ లోక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేయాలి

● ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

మామిడికుదురు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను వెంటనే అమలుచేయాలని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మామిడికుదురులోని ఈలి శ్రీనివాస్ స్వగృహం వద్ద జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ప్రమోషన్ లేకుండానే ఉపాధ్యాయులు రిటైర్డ్ అవుతున్నారన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలన్నీ చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లామని, రెండు నెలల్లో దశలవారీగా ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. సమావేశంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కంకటాల చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి దీపాటి సురేష్‌బాబు, చప్పిడి వెంకటేశ్వరరావు, యాళ్ల పల్లంరాజు, యెరుబండి సత్యనారాయణ, అడబాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

సమగ్రశిక్ష పథకంలో పదమూడు సంవత్సరాలుగా పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలంటూ వారు వినతిపత్రాన్ని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడుకు శుక్రవారం అందించారు. తాము పదమూడు సంవత్సరాలుగా జిల్లా పరిషత్ పాఠశాలలో ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీ టీచర్లుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తూమని, ప్రధానోపాధ్యాయుడు చెప్పినట్టు నడుచుకుంటున్నామని, వేసవిలో డ్రాప్ అవుట్ విద్యార్థులను బడిలో చేర్పిస్తూ వివిధ రకాల సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. బత్తులశ్రీనివాస్, నయినాల రాజేంద్రప్రసాద్, అశోక్, జిల్లా అధ్యక్షుడు జి.సత్యనారాయణ, కుమార్ పాల్గొన్నారు.

అంతర్వేదిలో ఎమ్మెల్సీ పూజలు

అంతర్వేది: అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులునాయుడు శుక్రవారం విచ్చేశారు. తొలుత ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం నిర్వహించి వేదపండితులచే ఆశీర్వచనం అందజేశారు.

బీవీసీలో క్రీడా పోటీలు ప్రారంభం

అల్లవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈపీఎల్, ఇంట్రామ్యూరల్ క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య, బోనం కనకదుర్గ, బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ డి.మహేశ్వర్‌లు ప్రారంభించారు. బోనం కనకయ్య మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యతోపాటు విద్యార్థుల్లో క్రీడానైపుణ్యం పెంపొందించడానికి ప్రతీఏటా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలు 18, 19 తేదీల్లో రెండు రోజుల పాటు జరుగుతాయని వైస్ ప్రిన్సిపాల్, క్రీడల కన్వీనర్ డాక్టర్ ఆకుల ప్రవీణ్ అన్నారు. క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నీకాయిట్, షటిల్, కోకో పోటీలు జరుగుతాయని అన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

● ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ నందకిశోర్

ముమ్మిడివరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ రైతులు చిరుధాన్యాల సాగుపై అవగాహన పెంపొందించుకుని వాటిని సాగు చేయాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ సూచించారు. ముమ్మిడివరం మండలం కొత్తలంకలోని సచివాలయంలో శుక్రవారం చిరుధాన్యాల సాగులో సమగ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో నందకిశోర్ పాల్గొని మాట్లాడారు. చిరుధాన్యాల్లో ప్రోటీన్లు, పీచు పదార్థాలు, కాల్షియం, మెగ్నీషియం, జింకు ఎక్కువగా లభిస్తాయన్నారు. చిరుధాన్యాలైన సజ్జలు, రాగులు, జొన్నలు, సామలు, అరికెలు, ఊదల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయన్నారు. వీటిని తీసుకోవడంవల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ముమ్మిడివరం ఏడీఏ గౌతమ్, ఏవో ఎస్.ప్రశాంత్‌కుమార్, అభ్యుదయ రైతులు, ప్రకృతి వ్యవసాయ రైతులు, మహిళలు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల రక్షణకు కృషి

అంతర్వేది, జూలై 18(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సంక్షేమానికి కన్స్యూమర్ ఫోరం కృషి చేస్తుందని జిల్లా కన్స్యూమర్ ప్రొటెక్ట్ కౌన్సిల్ మెంబరు మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. సఖినేటిపల్లి మండల అధ్యక్షుడు వీరా మల్లిబాబు అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలు నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల విషయంలో కఠిన వైఖరి ప్రదర్శించాలన్నారు. ఎంఈవో కిశోర్ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టిలో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు సమానమేనని, నియమ నిబంధనల విషయంలో వెసులుబాటుకు తావులేదన్నారు. ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు పట్ల డ్రైవర్లు, యాజమాన్యాలు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించరాదన్నారు.

ఆర్థికసాయం చెక్కుల పంపిణీ

అమలాపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): సేవ్ ది పీపుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో 7వ తరగతి చదువుతున్న గెద్దాడ భరత్‌కుమార్, 9వ తరగతి చదువుతున్న మానసలకు రూ.20వేలు చెక్కులను జిల్లా రెవెన్యూ అధికారిణి రాజకుమారి అందజేశారు. విద్యార్థుల తల్లి గంగాభవానీకి ఆ చెక్కులు అందించారు.

కనకమహాలక్ష్మికి ఆషాఢం సారె


అప్పనపల్లి కనకమహాలక్ష్మికి సారె తీసుకెళుతున్న దృశ్యం

మామిడికుదురు, జూలై 18(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి గ్రామదేవత కనకమహాలక్ష్మి అమ్మవారికి బాలబాలాజీ దేవస్థానం తరఫున ఆషాడం సారె శుక్రవారం సమర్పించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలిరాగా ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో 30కిలోల స్వీట్లు, పలు రకాల పండ్లు, గాజులు, పువ్వులు, గజమాల, పసుపునీళ్లు, చలిమిడి, వడపప్పు, పానకం తదితర వాటిని ఊరేగింపుగా భక్తుల కోలాహలం నడుమ మేళతాళాలతో భారీ ర్యాలీగా తీసుకువెళ్లారు. అమ్మవారికి గజమాల అలంకరించి సారెను సమర్పించారు.

శాకంబరిగా బూరుగులమ్మ

అంబాజీపేట: స్థానిక వీరభద్ర థియేటర్ వద్ద ఉన్న శ్రీ విజయకనకదుర్గమ్మ అమ్మవారిని ఆషాడమాసం సందర్భంగా వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ అమ్మవారిగా ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుల్లేటికుర్రు గ్రామంలో ఉన్న బూరుగులమ్మ అమ్మవారికి భక్తులు ఆషాడసారెను సమర్పించారు.

అయినవిల్లి: శానపల్లిలంక గ్రామంలో ఉన్న శ్రీ విజయ కనకదుర్గమ్మ అమ్మవారిని ఆషాడమాసం సందర్భంగా ఆలయకమిటీ ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరిదేవీగా ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి భక్తులు ఆషాడ సారెను సమర్పించారు.

ముమ్మిడివరం: మండలంలోని సీహెచ్ గున్నేపల్లి గ్రామదేవత శ్రీవనువులమ్మ అమ్మవారు శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడమాస శుక్రవారం కావడంతో అమ్మవారికి ఆ గ్రామానికి చెందిన గుమ్మళ్ల రాము సమర్పించిన పలు రకాల కూరగాయలతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారికి గుమ్మళ్ల రాము, గ్రామస్తులు సారె సమర్పించారు.

ఉప్పలగుప్తం: భీమనపల్లి గ్రామదేవత వనుమలమ్మను శుక్రవారం శాకాంబరి రూపంలో వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వనుములమ్మకు ముడుపులు చెల్లించుకున్నారు.

యానాం: యానాం ఓల్డ్ రాజీవ్‌నగర్‌లోని శ్రీదుర్గాభవాని అమ్మవారు శాకంబరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడమాసంను పురస్కరించుకుని కమిటీ ప్రతినిధులు భక్తులు కూరగాయలతో అమ్మవారినిఅలంకరించారు.

మావుళ్ళమ్మతల్లికి ఆషాఢం సారె

ఐ.పోలవరం: జి.మూలపొలం పంచాయతీ ఎర్రగరువు గ్రామదేవత మావుళ్ళమ్మకు శుక్రవారం ఆషాడమాసం సారె సమర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించుకున్నారు. ఎదుర్లంక రామాలయంసెంటర్లో శ్రీవిజయదుర్గమని కూరగాయలతో అలంకరించారు.

ప్రత్యేక పుష్పాలంకరణలో మావుళ్ళమ్మ



కాట్రేనికోన : ఆషాడ ఆఖరి శుక్రవారం సందర్భంగా కాట్రేనికోన మావుళ్ళమ్మతల్లికి పుష్పాలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు పణికాంత్‌శాస్త్రి ఆధ్వర్యంలో వినాయక పూజ, పంచామృతాభిషేకం, సహస్రకుంకుమార్చన జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆణివిళ్ళ సాయిబాబా, రామకృష్ణపరమహంస, గ్రంధి నానాజీ, గ్రంధి రాంప్రసాద్, సంసాని పాండురంగారావు, గ్రంధి సత్తిబాబు, గ్రంధి నారాయణమూర్తి, బుల్లి పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మకు సారె

అల్లవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): యెంట్రుకోన గ్రామదేవత శ్రీమహాలక్ష్మీవేములమ్మకు శుక్రవారం మహిళలు ఊరేగింపుగా గ్రామోత్సవం నిర్వహించి చీరలు, గాజులతో పాటు మిఠాయిలను సమర్పించారు. సారెసమర్పించిన అనంతరం మొక్కుబడులు తీర్చుకున్నారు.





పి.గన్నవరం ఇరిగేషన్ కార్యాలయం వద్ద సెంట్రల్ డెల్టా నీటి సంఘం సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ

రేపు పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష

జిల్లాలో రెండు కేంద్రాలు ఏర్పాటు : జేసీ



అమలాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని రెండు కేంద్రాల్లో 386 మంది అభ్యర్థులకోసం ఆదివారం కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పరీక్ష నిర్వహణకు సంబంధించి వివిధ శాఖల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల జరిగే పరీక్షకు 206 మంది, భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలల్లో జరిగే పరీక్షకు 180 మంది హాజరు కానున్నారని, వీరికి 20వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఉపతహశీల్దార్ గోపాలకృష్ణ, బీవీసీ కళాశాలలో ఉపతహశీల్దార్ సుబ్రహ్మణ్యేశ్వరరావు లైజన్ అధికారులుగా వ్యవహరించాలన్నారు. పరీక్షా సమయంలో ఆయా కేంద్రాల వద్ద 140 సెక్షన్ విధించడంతోపాటు సమీపంలో ఎటువంటి జిరాక్సు షాపులు తెరవకుండా మూయించి వేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో రాజకుమారి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీపీవో డి.శాంతలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అంతర్వేది

మినీ ఫిషింగ్ హార్బరు, టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు

అడ్వెంచర్ బోటింగ్ కోసం జిల్లా కలెక్టర్ స్థల పరిశీలన

అంతర్వేది, జూలై18(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీ, సాగర సంగమం అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరు అభివృద్ధి, టూరిజం అభివృద్ధికి అడ్వెంచర్ బోటింగ్ యాక్టివిటీ కోసం స్థల సేకరణకు కృషి చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం ఆయన అంతర్వేది సముద్ర ముఖద్వారం, వశిష్ఠ రేవులో బోటులో ప్రయాణించి మినీ ఫిషింగ్ హార్బర్ కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ మినీ ఫిషింగ్ హార్బర్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం 14 మంది సభ్యులతో కూడిన నిర్వహణ కమిటీని ప్రభుత్వం ఏర్పాటుచేసిందన్నారు. ఇటీవల కమిటీ సభ్యులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పూర్తిస్థాయి హార్బరు నిర్వహణనకు మౌలిక వసతులు కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని సూచించడం జరిగిందన్నారు. ఈనేపథ్యంలోనే మినీ ఫిషింగ్ హార్బరును క్షేత్రస్థాయిలో పరిశీలన, అధ్యయనం చేయడానికి స్థానికంగా అధికారుల బృందంతో పరిశీలించినట్టు చెప్పారు. మినీ ఫిషింగ్ హార్బరు ద్వారా ఆక్షన్ హాలు అద్దెలు, ల్యాండింగ్ చార్జీలు, ఇతర ఆదాయాలను పరిగణలోకి తీసుకుని నివేదిక రూపొందించడం జరిగిందని, ఆదాయ వనరులను పరిగణనలోకి తీసుకుని హార్బరుకు పూర్తిస్థాయిలో వసతులను నిర్వహణ కమిటీల సభ్యుల సారథ్యంలో కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం స్థానికంగా మడ అడవుల పరిరక్షణ చర్యలను బోటులో పర్యటించి పరిశీలించారు. అంతర్వేది బోటింగ్ సర్వీసెస్ అథారిటీ వారు బోటింగ్ యాక్టివిటీ కోసం టెండర్లు వేశారని, ఆ మేరకు స్థానికంగా సాధ్యాసాధ్యాలను బేరీజు వేస్తూ తదుపరి స్థల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. దిండి పర్యాటక రిసార్టు నుంచి బోటులో అంతర్వేది రక్తతుల్యకాల్వ వద్దకు పర్యాటకులు భక్తులు చేరుకుని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేలా బోటింగ్ యాక్టివిటీపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.మాధవి, పర్యాటకరంగ అభివృద్ధిశాఖ ప్రాంతీయ సంచాలకుడు పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వశిష్ఠ రేవులో బోటుపై పర్యాటక ప్రాంతంలో పర్యటిస్తున్న కలెక్టర్, ఆర్డీవో

ఈస్ట్రన్, సెంట్రల్ డెల్టా పరిధిలో 4,800 ఆక్రమణలు : ఎస్ఈ

పి.గన్నవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్, ఈస్ట్రన్ డెల్టాలో పరిధిలో కాల్వలు వెంబడి, ఇరిగేషన్ స్థలాల్లో ఐదేళ్ల కిందట 4,800 ఆక్రమణలు గుర్తించామని ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్ తెలిపారు. ఈ సంఖ్య ఈ ఐదేళ్లలో మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ప్రతి నెల రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు బృందంగా ఏర్పడి నోటీసులు అందిస్తున్నారని, మూడు నెలల అనంతరం జిల్లాస్థాయిలో రివ్యూలు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. పి.గన్నవరం సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద శుక్రవారం సెంట్రల్ డెల్టా పరిధిలో 56 నీటిసంఘాల సభ్యులతో ఏర్పాటుచేసిన సమావేశానికి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, ఎస్ఈ పాల్గొని మాట్లాడారు. కొత్తగా ఎన్నికైన నీటి సంఘాల సభ్యులకు త్వరలో శిక్షణా తరగతులు ఏర్పాటుచేస్తామన్నారు. ఈస్ట్రన్, సెంట్రల్ డెల్టా పరిధిలో 814 మంది లష్కర్లు ఉన్నారని, వారికి 8 నెలల జీతాన్ని చెల్లించగా, 15 రోజుల్లో మిగిలిన జీతాలను చెల్లించే ఏర్పాటుచేస్తున్నామన్నారు. సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ మాట్లాడుతూ లొల్లలాకులను రూ.77కోట్లతో స్థిరీకరిస్తే మూడు ప్రధాన పంటకాల్వలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం కాంట్రాక్టు లస్కర్లు ఎస్ఈ గోపీనాథ్, సెంట్రల్‌డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, వైస్‌ఛైర్మన్ కరుటూరి నరసింహరావును దుశ్శాలువాతో సత్కరించారు.





ఓడలరేవు తీరంలో టీ ఆకారంలో నిర్మించిన జెట్టీ శిథిల స్థితికి చేరుతున్న దృశ్యం... పిల్లర్లకే పరిమితమైన ఓడలరేవులో ఆక్షన్ హాలు

అసంపూర్తిగా మినీ ఫిషింగ్ హార్బర్లు

- అంతర్వేదిలో రూ.7 కోట్ల విలువైన పనులు పెండింగ్
- వాటిని సత్వరం పూర్తిచేయాలని ఎమ్మెల్యే వరప్రసాద్ వినతి
- కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన అంతర్వేది ఫిషింగ్ హార్బరు కమిటీ సభ్యులు
- ఓడలరేవులో ఇసుక మేటలతో పూడుకుపోతున్న జెట్టీ.. ఆక్షన్ హాలూ అంతే

మత్స్యకారుల మెరుగైన జీవనోపాధి లక్ష్యంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రెండు ప్రాంతాల్లో నిర్మించ తలపెట్టిన ఫిషింగ్ హార్బర్లు పూర్తికాకుండానే శిథిలస్థితికి చేరుతున్నాయి. అసంపూర్తి నిర్మాణాలు, రహదారులకు ఇరువైపులా పెరిగిపోయిన చెత్తాచెదారం, భవనాల్లో పెరిగిపోయిన పిచ్చిమొక్కలతో అధ్వాన స్థితికి చేరుకుంటున్నాయి. ఆ భవనాల నిర్మాణం, ఫిషింగ్ హార్బరుకు సంబంధించిన జెట్టీల నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థల నిర్లక్ష్యం ఫలితంగా నిరుపయోగంగా మారుతున్నాయని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

ఒడ్డుకు చేరిన బోట్లు



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సముద్రం, గోదావరి మొగలు కలిసే ప్రాంతమైన అంతర్వేది, అల్లవరం మండలం ఓడలరేవులో నిర్మించ తలపెట్టిన ఫిషింగ్ హార్బరుల నిర్మాణాల ప్రగతిపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని మత్స్యకారులు కోరుతున్నారు. అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరు అభివృద్ధి కోసం రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ ఇప్పటికే కొన్ని సమస్యలను కలెక్టర్‌తో జరిగిన సమీక్షలో ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్న పరిణామాలు ఆ ప్రాంత మత్స్యకారులను ఒకింత ఆనందానికి గురిచేస్తున్నాయి. సుమారు రూ.30 కోట్ల అంచనా వ్యయంతో అంతర్వేదిలో ఫిషింగ్ హార్బరు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.23 కోట్ల విలువైన పనులను కాంట్రాక్టు సంస్థ పూర్తిచేసి 2023లో ప్రభుత్వానికి అప్పగించినట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. మిగిలిన రూ.7 కోట్లకు సంబంధించిన పనులు సత్వరం చేపట్టి మత్స్యకారులు వేటకు వెళ్లేవిధంగా వాటిని అభివృద్ధి చేయాలని కోరారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా, తాగునీరు, అప్రోచ్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన వంటివి రూ.7 కోట్లతో చేపట్టి పూర్తిచేయాలని కోరారు. గతంలో జలవనరులశాఖ ద్వారా టెండర్లు పిలిచి చేపట్టిన ఈ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం హార్బరుకు 70కుపైగా పడవల ద్వారా మత్స్య ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నారు. పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తే రోజుకు 200కు పైగా పడవలు రాకపోకలు సాగించే అవకాశం ఉంది. ఈ మినీ హార్బరు నుంచి సింగపూర్, బెంగుళూరు, గోవా, ముంబై, కేరళ వంటి రాష్ట్రాలకు చేపల ఉత్పత్తుల ఎగుమతి అవుతాయని అంచనా. 1.75 కిలోమీటర్ల ఇక్కడి రహదారి మొక్కలతో అధ్వాన స్థితికి చేరింది. విద్యుత్ సౌకర్యంతోపాటు రాయితీలతో అందించే పెట్రోలు బంకులు కూడా ఇక్కడ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను అంతర్వేది మినీ హార్బరు కమిటీ సభ్యులు కోరారు. జిల్లా కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించి సత్వర చర్యలకు ఆదేశాలిచ్చారు.

ఓడలరేవులో అధ్వాన స్థితికి చేరిన హార్బరు

అల్లవరం మండలం ఓడలరేవులో మత్స్యకారుల కోసం కొన్ని సంవత్సరాల కిందట నిర్మించ తలపెట్టిన మినీ హార్బరు అసంపూర్తిగా నిలిచిపోయింది. జెట్టీ ఏర్పాటుచేసిన ప్రాంతంలో పూర్తిగా ఇసుక మేటలు వేయడం వల్ల అక్కడకు బోట్లు వచ్చే పరిస్థితి కూడా లేదనేది మత్స్యకారుల ఆవేదన. ప్రస్తుతం జెట్టీ కింది మార్గంలో నీటి ప్రవాహం కొనసాగే పరిస్థితులు ఉండాల్సినప్పటికీ ఇసుక మేటలు భారీగా పేరుకుపోవడంతో నిరుపయోగంగా మారుతోంది. రూ.7.78 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ జెట్టీ నిర్మాణం పనులపై అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు. టీ ఆకారంలో జెట్టీ నిర్మించడంతోపాటు ఆక్షన్ హాలు పిల్లర్లకే పరిమితమై పిచ్చి మొక్కలతో నిండిపోయింది. తక్షణమే మత్స్యశాఖ అధికారులు ఈ జెట్టీ నిర్మాణంపై దృష్టి పెట్టి పూర్తిచేయడంతోపాటు జెట్టీకి వచ్చే ప్రాంతంలో వేసిన ఇసుక మేటలు తొలగించి వందల బోట్లలో వేటాడే మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రేషన్ లైజేషన్!

రైస్ కార్డులకు.. రైట్ రైట్



(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు భారీగా వెల్లువెత్తాయి. గత వైసీపీ హయాంలో కొత్త కార్డుల జారీ లేకపోవడంతో వేలాది మంది పేదలు ఈసురోమన్నారు. రకరకాల కారణాలతో ఉన్న కార్డులను సైతం భారీగా అప్పట్లో ఏరేశారు. దీంతో ప్రభుత్వం మారాక కార్డుల జారీకి నిర్ణయించడంతో ఇప్పటి వరకు 1.53 లక్షల మంది అర్జీలు అందించారు. ఇందులో ఏకంగా 1.10 లక్షల మంది తమకు ఉన్న కార్డుల్లో అదనపు సభ్యులను చేర్చాలంటూ దరఖాస్తులు ఇచ్చారు. ప్రస్తుతం అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి దాదాపుగా పచ్చజెండా ఊపారు. త్వరలోనే లబ్ధిదారులకు ప్రభుత్వం కొత్తకార్డులను మంజూరు చేయనుంది.

నాడు ఉన్నవీ పీకేశారు..

గత వైసీపీ పాలనలో సంక్షేమ పథకాల అమలు పేరుతో ఎడాపెడా లబ్ధిదారులను కోసేశారు. రకరకాల నిబంధనల పేరుతో రేషన్‌కార్డులను భారీగా ఏరేశారు. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 16.50 లక్షల రేషన్‌కార్డులుండగా అందులో తెల్లకార్డులు 15.69 లక్షలు ఉండేవి. వీటిలో అనర్హులు అధికంగా ఉన్నారని భావించిన అప్పటి ప్రభుత్వం అమరావతి నుంచి 28,500 మంది కార్డుదారుల పేరుతో జాబితాను జిల్లా పౌరసరఫరాల శాఖకు పంపి గుట్టుగా క్షేత్రస్థాయి తనిఖీలు చేసి అందరి కార్డులు రద్దు చేయాలని ఆదేశించింది. 17,500 మంది కార్డుదారులు సొంత గ్రామాల్లో నివసించడం లేదనే కారణంతో వాటిని రద్దుచేసేశారు. దీంతో ప్రతిపక్ష హోదాలో నాడు టీడీపీ ఆందోళన బాట పట్టింది. కార్డులను అడ్డగోలుగా ఏరివేయడంపై నిరసనలు చేపట్టింది.అయితే ప్రభుత్వం మారిన తర్వాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టాలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టడానికి పచ్చజెండా ఊపారు. దీంతో గత మే 14 నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సచివాలయాల పరిధిలో రేషన్‌కార్డులకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొత్తగా వివాహమైనవారు, ఇప్పటివరకు రేషన్ కార్డు లేనివారు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ తప్పుగా నమోదైనవారు ఇలా ఏడు రకాల సేవలకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది.

1,53,341 అర్జీలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం ఇప్పటివరకు 1,53,341 మంది నుంచి అర్జీలు వచ్చాయి. కొత్తకార్డులు కావాలంటూ 14,197 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఉన్న కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చాలంటూ 1,10,587 మంది విజ్ఞప్తులు చేశారు. వచ్చిన అర్జీల్లో అత్యధికంగా కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చాలంటూ కోరినవే ఉన్నాయి. ఇప్పటివరకు వచ్చిన మొత్తం అర్జీల్లో 90 శాతానికిపైగా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. దాదాపు అన్ని అర్జీలను అధికారులు పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి జాబితా కూడా పంపారు. త్వరలో కొత్త కార్డుల జారీ చేయడానికి వీలుగా ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. దీంతో త్వరలోనే కార్డులు అందుతాయి.

- రేషన్‌కార్డులకు దరఖాస్తుల వెల్లువ
- ఉమ్మడిగా 1,53,341 వినతులు
- వైసీపీలో కార్డుల్లో కోత
- కూటమి ప్రభుత్వంలో అవకాశం
- భారీగా వెల్లువెత్తిన విజ్ఞప్తులు
- చేర్పులకు 1,10,587 దరఖాస్తులు
- అధికారుల గ్రీన్‌సిగ్నల్
- ఏటీఎం కార్డులా రైస్ కార్డులు

ఏ జిల్లాకు ఎన్ని..

- కాకినాడ జిల్లా నుంచి 62,988 మంది ఉన్నారు. ఉన్న కార్డుల్లో అదనంగా కుటుంబ సభ్యులను చేర్చాలని 46,729 మంది, రేషన్‌కార్డు విభజించాలని 6,091, కొత్త కార్డులకు 5,170, చిరునామా మార్పునకు 1,986 మంది అర్జీలు అందించారు.
- కోనసీమలో మొత్తం 45,080 దరఖాస్తులు రాగా చిరునామా మార్పునకు 1,751, కొత్త సభ్యులను చేర్చాలంటూ 32,254 పేర్లు రద్దుకు 1,275 కొత్తకార్డులకు 4,268, కార్డు విభజించాలని 4,536 అర్జీలు వచ్చాయి.
- తూర్పుగోదావరి జిల్లా నుంచి 45,273 అర్జీలు వచ్చాయి. తమ కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలంటూ 31,604 మంది మొర పెట్టుకున్నారు. కార్డులు విభజించాలంటూ 4,664 మంది, కొత్త కార్డులు కావాలని 4,759 మంది అర్జీలు అందించారు.

ఇక డిజిటల్ కార్డులు

చంద్రబాబు అంటేనే ఐటీ ముఖ్యమంత్రి అంటారు.. ప్రస్తుతం రేషన్ కార్డుల్లోనూ ఆ మార్పు చూపిస్తున్నారు. త్వరలో ఇవ్వనున్న కొత్త రేషన్‌కార్డులను రైస్ కార్డుల పేరిట ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఇవి పూర్తిగా ఏటీఎం కార్డు తరహాలో కొత్తగా డిజైన్ చేశారు. వీటికి క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. రేషన్ దుకాణంలో సరుకులు తీసుకున్న తర్వాత డీలర్ సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వానికి కార్డుదారులు తమ అభిప్రాయాలు కూడా తెలపవచ్చు.



ఆనంద హరితం!



- నెరవేరిన మరో హామీ
- గ్రీన్‌ట్యాక్స్ తగ్గింపు
- వైసీపీలో రూ.20 వేలు
- ప్రస్తుతం రెండు స్లాబ్‌లు
- రూ.1500, రూ.3 వేలు
- సర్కారు ఉత్తర్వులు జారీ

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం మరో హామీ నెరవేర్చింది.. గ్రీన్ ట్యాక్స్ తగ్గించి వాహనదారులకు పెద్ద ఊరటనిచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కసారిగా పెంచిన హరిత పన్ను వాహనదారుల తలకు మించిన భారమైంది. రోడ్డెక్కిన ప్రతి వాహనం నుంచి డబ్బులు గుంజేసింది. వందల్లో ఉండే గ్రీన్‌ట్యాక్స్‌ను వేలల్లో పెంచింది.. పర్యావరణం పేరుతో పది టన్నుల లారీలపై రూ.ఐదు వేలు, 30 టన్నుల లారీలపై రూ.15 వేలు విధించడంతో లారీ యజమానులు గగ్గోలు పెట్టారు. ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే ఈ ట్యాక్స్ తగ్గిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక హరిత పన్ను విషయమై లారీ యజమానుల వినతిని సర్కారు పరిశీలించింది. (గ్రీన్ ట్యాక్స్) హరితపన్ను భారాన్నితగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

వైసీపీలో పిండుడే..

గత ప్రభుత్వంలో వివిధ వాహనాలకు ఏటా గరిష్ఠంగా రూ.20 వేల వరకు గ్రీన్ ట్యాక్స్ విధించగా కూటమి ప్రభుత్వం దీనిని సవరించి ఏడాదికి రూ.1500, రూ.3000 చొప్పున రెండు శ్లాబుల్లో వసూలు చేసేలా కొత్త విధానం తెచ్చింది. సరకు రవాణా (లారీలు, వ్యాన్లు), ప్రజా రవాణా (బస్సులు, మినీ బస్సులు) ఏడేళ్ల తర్వాత ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలంటే ఏటా హరిత పన్ను చెల్లించాలి. గతంలో ఈ పన్ను కేవలం రూ.200 మాత్రమే ఉండేది. కాలం చెల్లిన వాహనాలను తగ్గించాలని దీనిని పెంచుకునేలా కేంద్రం వెసులుబాటు కల్పించింది. దీనిని ఆసరాగా తీసుకున్న జగన్ ప్రభుత్వం 2022 జనవరి నుంచి రాష్ట్రంలో హరిత పన్నును భారీగా పెంచింది. ఏడు నుంచి పదేళ్ల వాహనాలకు సగం త్రైమాసిక పన్ను విలువ, పదేళ్ల నుంచి 12 ఏళ్లనాటికి ఒక త్రైమాసిక పన్ను విలువ, 12 ఏళ్లు దాటితే రెండు త్రైమాసిక పన్నుల విలువ మేర చెల్లించేలా ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆయా వాహనాల కేటగిరీ, వాటి వయసు బట్టి కనిష్ఠంగా రూ.800 మొదలుకొని గరిష్ఠంగా రూ.20 వేల వరకు ఏటా చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. లారీలు, టిప్పర్ల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేసింది. పాసింజర్ వాహనాలు, స్కూలు, కాలేజీ బస్సులు, మ్యాక్సీ క్యాబ్స్, ఓమ్నీ బస్సులు వంటి వాటికి రూ.ఆరు వేలు, చివరికి ఆటోలు, బైక్‌లు, క్రేన్‌లు, ట్రాక్టర్లపైనా భారీగా పన్ను పెంచారు. పన్ను భారం భరించలేక వీరంతా ఆందోళనలు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఉమ్మడి జిల్లాలో 55 వేల వరకు లారీలు ఉండగా, వీటిపై కోట్లలో పన్ను భారం పడింది. కాకినాడ జిల్లాలో 2.94 లక్షలు, తూర్పుగోదావరి జిల్లాలో 2.10 లక్షలు, కోనసీమ జిల్లాలో 1.80 లక్షల వాహనదారుల నుంచి జగన్ ప్రభుత్వం హరిత పన్ను పిండేసింది.

జిల్లాల్లో తగ్గనున్న భారం

ప్రస్తుతం హరిత పన్నుపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రూ.24.10 కోట్ల వరకు ఉమ్మడి జిల్లా వాహనాలపై పన్నుభారం తగ్గనుంది. అత్యధికంగా కాకినాడ జిల్లాలో 2.94 లక్షల వాహనాలపై రూ.9 కోట్లు, తూర్పుగోదావరిజిల్లాలో 2.10 లక్షల వాహనాలపై రూ.8.10 కోట్లు, కోనసీమలో 1.80 లక్షల వాహనాలపై రూ.ఏడు కోట్ల పన్ను భారం తగ్గనుంది.

సాంకేతిక విద్య పట్ల విద్యార్థుల ఆసక్తిని పెంపొందించాలి - డీఈవో సలీంబాషా

అమలాపురం రూరల్, జూలై18(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సాంకేతిక విద్యపై ఆసక్తిని పెంపొందించి సంబంధిత పరికరాలు వినియోగించే విధంగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా సూచించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల వినియోగం 40 శాతం నుంచి నూరుశాతం జరిగేలా చూడాలన్నారు. జిల్లాలోని 45 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు పూర్తిస్థాయిలో క్రియాశీలంకగా పనిచేసేందుకు విజయవాడ సెయింట్ మేరీ స్టెల్లా కళాశాలలో ప్రత్యేక వర్కుషాపు నిర్వహించారు. ప్రతీ ఐదు ల్యాబ్‌లకు ఒక రిసోర్సు పర్సన్‌ను నియమించగా జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం నేతృత్వంతో 11 మంది రిసోర్సుపర్సన్ల బృందం వర్కుషాపులో పాల్గొంది.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం




శాకంబరి అలంకరణలో రాయవరం పోలమ్మ అమ్మవారు. పక్క చిత్రంలో కొత్తపేటలో శాకంబరిగా దర్శనమిచ్చిన తాళ్ళమ్మ అమ్మవారు

శాకంబరిగా గ్రామ దేవతలు

ఆలమూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల, సంధిపూడి గ్రామాల్లోని గ్రామ దేవతలను ఆషాడమాసం శుక్రవారం సందర్భంగా శాకంబరులుగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చొప్పెల్ల గ్రామ దేవత కనకమహాలక్ష్మి, పెదపళ్ల పోలేరమ్మ, సంధిపూడి రావులమ్మ అమ్మవార్లను శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆషాడమాసంలో అమ్మవారిని శాకంబరిగా పూజిస్తే శుభం కలుగుతుందని ఆయా ఆలయ అర్చకులు భక్తులకు తెలిపారు.

రాయవరంలో పోలమ్మ..

రాయవరం, (ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామస్తుల ఇలవేల్పు పోలమ్మ అమ్మవారు ఆషాడమాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని శాకంబరి అవతారంలో అలంకరించారు. అమ్మవారిని సుమారు 300 కిలోల కూరగాయలు, ఆకుకూరలను ఉపయోగించి అమ్మవారి మూల విరాట్‌తో పాటు పరివార దేవతలను ఆలయ ప్రాంగణాన్ని అలంకరించినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.వెంకటరమణ తెలిపారు. పోలమ్మ ఆలయ యూత్ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించినట్లు ఆయన తెలిపారు. రాయవరం పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

కొత్తపేటలో తాళ్ళమ్మ..

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం గ్రామదేవత తాళ్లమ్మ అమ్మవారు శుక్రవారం శాకంబరీగా దర్శనమిచ్చారు. ఆషాడమాసాన్ని పురస్కరించుకుని వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. గౌడ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మిద్దే ఆదినారాయణ, టీడీపీ సీనియర్ నాయకుడు గుబ్బల మూర్తి తదితరులు కుటుంబాలతోపాటు పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గ్రంథాలయాల్లోనే మేథాశక్తి దాగి ఉంది

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆలమూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లోనే మేథాశక్తి దాగి ఉందని వాటిని యువత ఉపయోగించుకుంటే వారు ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరులో రూ.10లక్షలతో ఆధునికీకరించిన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే బండారు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించి కొద్దిసేపు అక్కడ ఉన్న పాఠకులతో మాట్లాడారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను యువతకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమం లో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, సర్పంచ్ నాతి లావణ్యకుమార్‌రాజా, గ్రంథాలయ అధికారి నమశ్శివాయ, నాయకులు ఈదల నల్లబాబు, ఈదల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన: ఆలమూరు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల రెవెన్యూ, మండల పరిషత్, విద్య, వ్యవసాయశాఖలతో పాటు, ఉపాధి హామీ పథకం, స్త్రీశక్తి భవనంలోని కార్యాలయాలు, కోర్టు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజు, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



గ్రంథాలయ అదనపు గదులను ప్రారంభించి పుస్తకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

వైభవంగా మహాలక్ష్మి హోమం, సామూహిక కుంకుమార్చన



కపిలేశ్వరపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకిలోనున్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి సుప్రభాత సేవ, లఘుఅర్చన, నవనీత హారతి, విశ్వక్సేనారాధన, పుణ్యాహ వచనం, నవకలశారాధన, కుంభపూజ, కమల పుష్పాలతో శ్రీ మహాలక్ష్మి హోమం, సామూహిక కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. అలాగే తోమాలసేవ, స్వామి రాజాధిరాజ అలంకారంలో గజవాహన సేవ, తదితర పూజలను ఆలయ అర్చకులు వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపారు. దేవదాయశాఖ, వైఖానస ఆగమ పండితులతో ఈనెల 12న ప్రారంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాలు 21తో ముగియనున్నట్లు ఆలయ అర్చకులు, బ్రహ్మోత్సవ కమిటీ తెలిపారు. జూన్ 30 నుంచి పలువురు భక్తులు గోవిందమాల దీక్షాధారణ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీల బలోపేతానికి కృషి చేయండి

కె.గంగవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): సొసైటీల బలోపేతానికి త్రిసభ్య కమిటీలు కృషి చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. శుక్రవారం కుందూరు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారానికి ఆయన హాజరై ప్రసంగించారు. త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా జగతా వెంకటరమణారావు, సభ్యులుగా నెక్కంటి బాల శ్రీసత్యసాయి హనుమాన్, కడియాల ధనరాజులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ సొసైటీ నుంచి రైతులకు అందాల్సిన అన్ని రకాలు సేవలు అందించి సొసైటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కుందూరు త్రిసభ్య కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు సత్యం



ఆలమూరు మండలం పెదపళ్లలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా సామూహిక కుంకుమార్చనలు

ఆలమూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పెదపళ్లలో పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని శాకంబరిగా అలంకరించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సామూహిక కుంకుమార్చనల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు పూజా కార్యక్రమాలను మహిళలతో శాస్త్రోక్తంగా జరిపించారు. చొప్పెల్ల, సంధిపూడి గ్రామాల్లోను కనకమహాలక్ష్మి, రావులమ్మ అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు.

పెద్దింట్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

రావులపాలెం, జూలై 18(ఆంధ్రజ్యోతి): రావులపాలెం కొత్తకాలనీలో ఉన్న పెద్దింట్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాసం సందర్భంగా ఆలయ అర్చకుడు అజయ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి నిర్వహించిన పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారికి పెద్దఎత్తున మహిళలు సారె సమర్పించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



కొత్తకాలనీలో ఉన్న పెద్దింట్లమ్మ అమ్మవారికి సారె తీసుకు వస్తున్న మహిళలు



మాట్లాడుతున్న కమిషనర్ రంగారావు

ప్లాస్టిక్ వాడితే చర్యలు

మండపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని మండపేట మున్సిపల్ కమిషనర్ టీ.వీ.రంగారావు వ్యాపారులను హెచ్చరించారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులతో ప్లాస్టిక్ రహిత పట్టణంపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సమావేశంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాయవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన తెలిపారు. శుక్రవారం రాయవరంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ సమావేశపు హాల్‌లో ఉదయం 10 గంటలకు ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.



యండగండిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై రైతుల హర్షం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కె.గంగవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): బీటలువారిన పొలాలు శీర్షికతో యండగండిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడం వల్ల పొలాలు ఎండిపోతున్న విషయాన్ని శుక్ర వారం ఆంధ్రజ్యోతి ప్రచురించింది. దీనిపై కె.గంగవరం విద్యుత్‌శాఖ ఏఈ భాస్కర్ స్పం దించారు. శుక్రవారం హుటాహుటీన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

రక్షిత మంచినీటిలో పురుగులు

ద్రాక్షారామ, జూలై 18(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో రక్షిత మంచినీటిలో పురుగులపై స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ద్రాక్షారామ శివరంజని థియేటర్ వద్ద రక్షిత మంచినీటి కుళాయి ఉంది. రక్షిత మంచినీటి ట్యాంకు ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. శుక్రవారం ఉదయం యథావిధిగా స్థానికులు కళాయి నీరు పట్టుకున్నారు. నీటిలో తోకపురుగులు కనిపించడంతో షాక్‌కు గురయ్యారు. తాగునీటిలో పురుగులు రావడంతో పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదుచేశారు. కళాయి ఏర్పాటు చేసిన ప్రాంతం పూర్తి అపరిశుభ్ర వాతావరణంలో ఉంది.

కుళాయి తొలగింపు: తాగునీటిలో పురుగులు రావడంతో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టినట్లు సర్పంచ్ కొత్తపల్లి అరుణ తెలిపారు. పురుగులు వచ్చిన కుళాయిని పంచాయతీ సిబ్బంది తొలగించారు.

రేపు అశిరాంబ అమ్మవారి జాతర

కపిలేశ్వరపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న అశిరాంబ అమ్మవారి జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ జాతర మహోత్సవంలో భాగంగా గరగనృత్యాలు, డప్పువాయిద్యాలు, సన్నాయిమేళాలు, కేరళవాయిద్యాలు, విచిత్ర వేషాలతో బాణాసంచా మధ్య అమ్మవారి జాతరను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసామన్నారు. సోమవారం ఆలయం వద్ద తీర్థం, మంగళవారం అమ్మవారి నైవేద్యాలతో ఉత్సవాలు ముగియనున్నట్లు వారు తెలిపారు.



ఐఐటీ విద్యార్థికి సత్కారం

ఆలమూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): జెఈఈ అడ్వాన్సులో ర్యాంకు సాధించి ఐఐటీ ముంబైలో సీటు పొందిన సంధిపూడి గ్రామానికి చెందిన తోట వెంకటరాజును మండపేట కాపు అభ్యుదయ సంఘం నాయకులు సత్కరించారు. ఈసందర్భంగా వెంకటరాజును సత్కరించి అభ్యుదయ సంఘం నుంచి తన చదువుకు ఉపకరించే విధంగా నగదును అందించారు. కార్యక్రమంలో కాపు అభ్యుదయ సంఘం నాయకులు జిన్నూరి సాయిబాబు, వల్లే సత్యనారాయణ, యాళ్ల శ్రీను, మెండు బాపిరాజు, ఈలి తాతాజీ, దూలం నాగు, తోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం

మండపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మానవ అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవాన్ని జరిపారు. స్టేషన్‌మాస్టర్ నీరజ్, రైల్వే ఎస్ఐ విశ్వనాధ్‌లు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగార్జున, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



ఆత్రేయపురం మండలం బొబ్బర్లంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథం వైపు నడిపిస్తున్న ఘనత కూటమి పాలనదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు సుపరిపాలన తొలి అడుగులో భాగంగా ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రాజు, తహశీల్దార్ ప్రకాష్‌బాబు, నాయకులు ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్‌కుమార్, ఈదల రాంబాబు, రామానుజుల శేషగిరిరావు, ఈదల నల్లబాబు, కేతా రాంబాబు, రాంబాబు, సాలి సత్యనారాయణ, దండంగి మమత, అనుసూరి నాగరత్నంతోపాటు నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

చెల్లూరులో...

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు శివారు సూర్యారావుపేటలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ మోరంపూడి రాజ్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడంతో పాటు రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినట్లు చెప్పారు. సూర్యారావుపేటలో ఇంటింటికీ పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముత్యాల శబరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురంలో...

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు శుక్రవారం బొబ్బర్లంకలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుని దాన్ని యాప్‌లో పొందుపరిచారు. సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు జల్లి రాజకుమార్, జాన శ్రీను, దాసరి గణేష్, చల్లా వెంకన్న టి.మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కూనంపూడి రామకృష్ణంరాజు ఆయా గ్రామాల్లో పర్యటించారు.



రాయవరం మండలం చెల్లూరులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



ర్యాలిలో వృద్ధులు, పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందచేస్తున్న దృశ్యం

డొక్కా సీతమ్మ సేవలు ప్రశంసనీయం

ఆత్రేయపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ సేవా సమితి సేవలు ప్రశంసనీయమని లండన్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మోహిత్ కృష్ణ తెలిపారు. మూడవ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక అన్నపూర్ణ డే కేర్ హోమ్‌లో సుమారు 50 మంది వృద్ధులు, పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు, దుప్పట్లు వంటివి అందించి అన్నదానం జరిపారు. కార్యక్రమంలో అనూష్ సంస్థ కోశాధికారి కాశీ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సభ్యుల నిధులు గోల్‌మాల్

యానిమేటర్ల చేతివాటంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘ సభ్యులు



పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మోడేకుర్రు అంబేడ్కర్ గ్రూప్ మహిళలు

కొత్తపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలంలో ఎస్సీ, ఎస్టీ, డ్వాక్రా మహిళా సంఘాలకు రుణాలుగా ఇచ్చే సబ్‌ప్లాన్ నిధులు, స్త్రీనిధి నిధులతో పాటు పలు విభాగాల నిధులలో వాయిదా పద్ధతిలో రికవరీ చేసినప్పటికి సంబంధిత యానిమేటర్లు ఆయా బ్యాంకులకు చెల్లించకుండా సుమారు రూ.74లక్షల నిధులను గోల్‌మాల్ చేసినట్లు గుర్తించారు. దీనిలో సంబంధిత యానిమేటర్లు చేతివాటం ప్రదర్శించి పక్కదారి పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్తపేట మండలం మోడేకుర్రు మహాలక్ష్మినగర్‌కు చెందిన అంబేడ్కర్ గ్రూప్ సభ్యులు తమ గ్రూప్‌లో రుణంగా తీసుకున్న రూ.1.80 లక్షలు తాము పూర్తిగా చెల్లించినప్పటికి సంబంధిత యానిమేటర్ పక్కదారి పట్టించినట్లు కొత్తపేట పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ జి.సురేంద్ర విచారణ చేస్తామన్నారు.

నిధులు పక్కదారి పట్టిన మాట వాస్తవమే

ఏపీఎం విశ్వనాథ్

మండలంలో రుణాలుగా ఇచ్చిన డబ్బులు గ్రూప్ సభ్యులు చెల్లించినప్పటికి పక్కదారి పట్టిన మాట వాస్తవమేనని ఏపీఎం విశ్వనాథ్ తెలిపారు. పీడీ జయచంద్రగాంధీ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని రూ.73,53,045లు పక్కదారి పట్టినట్లు గుర్తించామన్నారు. దీనిలో 15 మంది యానిమేటర్ల పాత్ర ఉందని పూర్తి విచారణ చేసి రికవరీ చేస్తామన్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.5.11లక్షలు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,11,671 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

భక్తుల సౌకర్యాలపై చర్యలు: వాడపల్లి ఆలయానికి శనివారం వచ్చే భక్తుల సౌకర్యాలపై చర్యలు చేపడుతున్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వివిధ శాఖల అధికారులతో సమీక్షించిన నేపథ్యంలో శుక్రవారం ఆలయ ఉపకమిషనరుతో పాటు, అడిషనల్ డీఎంహెచ్‌వో సుమలత, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, ఎస్ఐ ఎస్.రాము పరిశీలించారు. నూతన క్యూలైన్ల ఏర్పాటు, మెడికల్ క్యాంపుల ఏర్పాట్లు, లడ్డూ కౌంటర్ల పెంపుదల తదితర ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జలప్రసాదం కూలర్లను ఈవో ప్రారంభించారు. భక్తులకు చల్లని తాగునీరు అందించేందుకు శుద్ధి చేసిన తాగునీరును అందించేందుకు కూలర్లను ఏర్పాటు చేసి ప్రారంభించారు.

భక్తుల సమస్యలను సకాలంలో పరిష్కరిస్తాం

డయల్ యువర్ ఈవోలో చక్రధరరావు

వాడపల్లి ఆలయంలో భక్తుల సమస్యలను పరిష్కరించేందుకు డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఈవో సూర్యచక్రధరరావు తెలిపారు. శుక్రవారం డయల్ యువర్ ఈవోలో పలువురు భక్తులు సమస్యలు, సలహాలు తెలిపారు. భీమవరానికి చెందిన మురళీ అనే భక్తుడు కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. తిరుమల, షిర్డీ తరహాలో కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. సుప్రభాత సేవ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని మరో భక్తుడు ఫోన్‌కాల్‌లో వివరించగా ఆదివారం నుంచి టిక్కెట్లు ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేస్తానని ఈవో బదులిచ్చారు. లగేజీ కౌంటర్లలో తరచూ సమస్యలు ఏర్పడుతున్నాయని జగ్గంపేట నుంచి సతీష్ అనే భక్తుడు వివరించగా కౌంటర్ వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రతి శనివారం ఉదయం 4.15 నుంచి రాత్రి 10 గంటల వరకూ దర్శనాలు అందిస్తున్నామన్నారు. మధ్యాహ్నం స్వామివారి నివేదన కోసం 15 నిమిషాలు మాత్రమే దర్శనాలు నిలుపుదల చేస్తునట్లు తెలిపారు.



ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారుల బృందం

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థుల ఎంపిక

రావులపాలెం, జూలై 18(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలం ఈతకోటలో ఉన్న లిథియా ఫార్మసీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎంపికైనట్లు సెక్రటరీ గొల్లపల్లి శ్రీధర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ దివిస్ ఫార్మా కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో తమ కళాశాలకు విద్యార్థులు 20 మంది ఎంపికైయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను సెక్రటరీతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మనోహర్‌బాబు, కళాశాల డైరక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ పి.రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అభినందించారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

రావులపాలెం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని టౌన్ సీఐ శేఖర్‌బాబు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లు అన్నారు. రావులపాలెంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సులు, వాహనానికి సంబంధించిన పత్రాలు ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కేవీ రమణరెడ్డి, సీతారామ ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

మండపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎన్‌జీవో సంఘ కోనసీమ జిల్లా అధ్యక్షుడు బాహూజీ కోరారు. మండపేట తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ ఎన్‌జీవో సంఘ అధ్యక్షుడు ఎంవీవీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు మద్దాల బాహూజీ మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటుపై ఈనెల 25, 26 తేదీల్లో విజయవాడలో జరిగే సమావేశంలో నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆలమూరు, మండపేట, రాయవరం తాలుకా నాయకులతోపాటు జిల్లా వీఆర్‌వో సంఘ అధ్యక్షుడు బలుసు రామకృష్ణ, కె.జ్యోకుమార్, ప్రభుదాస్, మేరి, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



నియోజకవర్గస్థాయి ఎన్‌జీవోల సమావేశానికి హాజరైన ప్రతినిధులు

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకువెళతాం

మండపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేయటం తప్ప చేసిందేమీ లేదని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. మండపేటలో శుక్రవారం నియోజకవర్గ సమన్వయకర్త ఎమ్మెల్సీ తోట తిమూర్తులు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా బొత్సతోపాటు ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి, జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బొత్స, ఎంపీ బోస్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనపై ధ్వజమెత్తారు. అనంతరం మాజీ మంత్రి గొల్లపల్లి, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ తోట ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. సమావేశంలో పలువురు వక్తలు ప్రసంగించారు. సమావేశంలో పార్టీనేతలు, పార్టీ ఇన్‌చార్జీలు, స్థానిక నేతలు, ఎంపీపీలు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, వేగుళ్ల పట్టాభి రామయ్య, రెడ్డి రాజబాబు, కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, రాయవరం, కపిలేశ్వరపురం ఎంపీపీలు, మాజీ ఎంపీపీ సిరిపురపు శ్రీను, మున్సిపల్ కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, మండల అధ్యక్షులు, పార్టీశ్రేణులు తదితరులు పాల్గొన్నారు.